తెలుగునాడు

మహాకవి
దాసు శ్రీరాములు

ఏలూరులో ఫస్ట్ గ్రేడ్ ప్లీడరుగా

శ్రీ దాసు శ్రీరాములు గారు

శ్రీ

తెలుఁగు నాడు

అను

ఆంధ్రవీధిలో బ్రాహ్మణ ప్రశంస

అను

మొదటి భాగము

రచన :

మహాకవి దాసు శ్రీరాములు

ప్రచురణ :

మహాకవి దాసు శ్రీరాములు స్మారక సమితి

హైదరాబాదు

Telugunadu
by
Mahakavi Dasu Sriramulu

తెలుఁగు నాడు

మహాకవి దాసు శ్రీరాములు

6వ కూర్పు : 1974

7వ కూర్పు : 2024

© మహాకవి దాసు శ్రీరాములు స్మారకసమితి

డా॥ దాసు అచ్యుతరావు
ఫ్లాట్ నెం.201 శ్రీ సాయిరామ్ ఆదిత్యా రెసిడెన్సీ,
ఇంజనీర్స్ కాలనీ, ఎల్లారెడ్డిగూడ, హైదరాబాద్ - 500 073.
ఫోన్ : 040-23734864, 9490023947
email : araodasu@gmail.com

డి.టి.పి.
సమంత గ్రాఫిక్స్
దమ్మాయిగూడ,
సికింద్రాబాదు - 500 083.
ఫోన్ : 9849551462

తొలిపలుకు

మహాకవి దాసు శ్రీరాములు పంతులుగారు న్యాయవాది వృత్తి నవలంబించి నిరంతరలౌక్య కార్యమగ్నులై యుండియు నెట్లో తీరిక చేసికొని పెక్కు గద్య పద్య గ్రంథములు రచించి శతావధాని చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి, ప్రముఖులైన కవి పండితుల ప్రశంసలందుకొని యుండిరి. వారి పద్యకావ్యములలో బృహత్తర మైనది దేవీ భాగవతాంధ్రానువాదము; చిన్నదయ్యు బహు ముద్రణములంది యధిక ప్రచారము గాంచినది తెలుఁగునాడు. వారు తెలుఁగునాడును 28.12.1892 నకు సరియగు నందననామ సంవత్సర శుభ పుష్య నవమీ కుజ వారమునాడు రచింప నారంభించి దాని యందలి ప్రథమ భాగమగు బ్రాహ్మణ ప్రశంసను మాత్రము ముగించి దివంగతులైరి. ఆ గ్రంథమును వారు పూర్తిచేసి యుండినచో నది యపూర్వమై యాంధ్ర సారస్వతమున కమూల్యాలంకారమై యలరారి యుండెడిది.

పూర్వకవులలో శ్రీనాథకవి సార్వభౌముడు క్రీడాభిరామమను వీధి నాటకము నొక దానిని రచించిన ట్లెల్లరు నెఱుంగిన విషయమే. అది వినుకొండ వల్లభరాయ రచితమని కొందఱి యభిప్రాయము. ఎవ్వరు రచించినను తెలుఁగు నందలి మొదటి నాటక మదియే. నాటకమన్న పేరే కాని యదియు శ్రవ్య పద్ధతినే రచింపఁబడినది. ఇంచుక మార్పుతో దానిని దృశ్యముగా చేయవచ్చును. అది మంచనశర్మ టిట్టిభ సెట్టి అను నిరువురు మిత్రుల సంభాషణము రూపమున సాగినది. అందా కాలమునాఁటి రాజకీయ సాంఘికాది విషయ వర్ణనముతో పాటు స్త్రీలవర్ణనమును అధికముగాఁ గలదు. శ్రీరాములు పంతులు గారు దానిని జూచియే కాఁబోలు నసభ్యమగు శృంగారమును బరిహరించి యాంధ్ర దేశమునందలి యన్ని జాతుల వారి వేషభాషా సంప్రదాయాదులను యథాతథముగా వర్ణింపవలెనను నుద్దేశముతో నీ గ్రంథమును రచింప నారంభించిరి. "కులవర్తనముల నానాకలనము లాచారముల ప్రకారము లందంబులఁ జందంబుల నుడుగుల పలు తెఱఁగులు నిందుఁ జెప్పఁబడుఁగడు

వేడ్కన్” అని వారే యా గ్రంథము స్వరూపము వివరించి యుండిరి. ఏ కారణముచేతనో వారొక్క బ్రాహ్మణ ప్రశంసతోడనే గ్రంథమును విడిచివేసిరి. వారు దీని నాంధ్ర వీథియని పేర్కొన్నను దీనిని సంభాషణాత్మకముగాఁ గాక వర్ణ నాత్మకముగనే సాగించిరి. ఇందు వీథిరూపక లక్షణము లేవియుఁ గానరావు.

తెలుఁగు నాట బ్రాహ్మణులలో ననేక శాఖలున్నవి. ఆయా శాఖలందలి స్త్రీ పురుషులయు యువతీయువకులయు వేషభాషా వృత్తులందు వైలక్షణ్యము గోచరించును. శ్రీరాములు పంతులు గారు వానినన్నింటిని మిక్కిలి నిశితముగాఁ బరిశీలించి యీ గ్రంథమున సహజముగను సరసముగను వర్ణించి యుండిరి. “ఉన్నది యున్నయట్లు మధురోక్తులఁ జెప్పిన కబ్బ మెప్పుడున్ బన్నము నొంద దందఱును బాగని మెత్తు”రని వారి యభిప్రాయము. ఆ యభిప్రాయమున కనుగుణముగనే వారిందు పక్షపాతము కాని, అభిమానము కాని తోవకుండ బ్రాహ్మణశాఖలందుఁ దమకుఁ గన వచ్చిన విశేషములు మంచివైనను జెడ్డవైనను లెస్సగా వివరించి యుండిరి. “ఇది నవవీధి దీనికి ననేక రసంబు లనేక నాయకుల్ పదపడి మంచిచెడ్డలును బాగులునోగులు మేలుగీళ్ళునుం గొదవలు గొప్పలంధ్ర జనకోటికి నెట్లగునట్లు చెప్పెద” నని వారు గ్రంథారంభమున వాక్రుచ్చి యట్లే రచనచేసి యుండిరి. లోకమునందలి జనులందఱును భగవంతునిచే సృజింపఁబడిన వారే. ఆతని దృష్టిలో నందఱును సమానులే. కాని స్వభావజములైన కొన్ని మంచి చెడ్డలు వారియందు గోచరించుట సహజము. కవిగారు వాని నీ గ్రంథమున రసవన్మనోహరముగా వర్ణించి యున్నారు.

వైదికులు, నియోగులు, స్మార్తులు, మాధ్వులు, వైష్ణవులు, శైవులు, కరణకమ్మలు, ద్రావిడులు. గోల్కొండ వ్యాపారులు మున్నగు బ్రాహ్మణులందఱు నందు వర్ణింపఁబడి యున్నారు. చివరఁ గొన్ని పండుగలు, అత్తకోడండ్రు, వివాహములు, పొడుము మొదలగు విషయములనుగూడ సంగ్రహముగా స్పృశించియున్నారు. శ్రీ పంతులుగారి వర్ణన విధానము మిక్కిలి రమణీయమై

యెడనెడ హాస్యచ్ఛాయలతోఁగూడి చదివిన కొలంది. చదువవ లెనను నుత్కంఠ రేకెత్తించుచున్నది. వారిచే హేళన చేయఁబడిన వారుకూడ నాయా పద్యములను జదివి దరహాస సుందరవదనులగుదురే కాని యీర్ష్యా ద్వేషకలుషి తాంతరంగులు కారు. వేమన పద్యములలోనిట్టి సరసమైన హేళన కనిపించును. అది పరితల కాయాదోషముల నెత్తి చూపి వానిని బరిహరించుకొనవ లెనను నభిలాష రేకెత్తించి సంస్కరణమునకు దారి చూపును. శ్రీ పంతులుగారు శిష్టాచార సంపన్నులయ్యు నుచితములైన సంస్కరణములకు విముఖులు కారు. బ్రాహ్మణులంతఃశాఖా వివాహములు చేసికొనవలెనని వారి యుద్దేశము. వారి లోక పరిశీలన మద్భుత మైనట్టిది. వైదికులు, లౌకికులు మున్నగువారి యందలి ప్రధాన లక్షణములను, మాటలాడు తెఱంగులను వారెంతో చక్కగా వివరించి యుండిరి. "ఆస్సేచూస్సివషే," "కమ్మని మాట యొక్కటి సుఖమ్ముగఁ జెప్పెద" "అచ్చమ్మా యిది యేమిటే" "మాతుగళిల్లె నమ్మ" మున్నగు పద్యము లిందుకుఁ దార్కాణములు. "మా కత్తెసరంచు లౌక్యుల గృహంబులఁ జొచ్చిన వైదికోత్తముల్ కుత్తుక నిండఁ బచ్చడియు గోరసమన్నము దిం(ద్రు నిచ్చలున్" అనియు "నియోగిలో కమ్మని వార్యకార్య ఘటకమ్మవుఁ గాని పరోపకార శూన్యమ్మును స్వప్రయోజన పరాయణమున్ దలపోయనిద్దరన్" అనియు వారు మొగ మోటమి లేకుండఁ దమకు సత్యమని తోఁచినది చెప్పియున్నారు. ఇట్లే అన్ని శాఖలవారిని గూర్చియు వారు చెప్పిన విషయము లెల్ల నిష్పక్షపాతములును యథార్థములునై యొప్పారుచున్నవి.

ఇందలి పద్యము లెల్ల ధారాశుద్ధి శోభితములును, భావ గంభీ రములును, నిర్దుష్ట పద ప్రయోగ భాసురములునై హృద్యములుగా నున్నవి. శ్రీ చెళ్ళపిళ్ళ వారి వంటి మహాకవులకే యందుఁ గొన్ని ధారణా యోగ్యములై యుండెనని వాని సౌష్టవమునుగూర్చి వేఱుగా చెప్పనేల. కొన్నిచోట్ల కవిగారు దేశ పూర్వకముగనే స్వతంత్ర ప్రయోగములు కావించినారు. రెండు మూఁడుచోట్ల శబ్దాలంకార సంఘటనమున్నది. మాధ్వులను వర్ణించునప్పుడు వ్రాసిన 'వీటీ

మోది' అను పద్యము సమాస భూయిష్ఠమై వారి ప్రౌఢతా ప్రీతిని జాటు చున్నది. పెక్కు సీసములు శ్రీనాథుని సీసములను దలపించుచున్నవి. వారి కుటుంబమునకుఁ జెందిన యువకులును పెద్దలును వారి గ్రంథముల నన్నిటిని సేకరించి మరల ముద్రింపించి వాని నాంధ్రుల కందఁజేయుటకై చేయు ప్రయత్న మచిర కాలముననే సాఫల్యము నొందుఁగాక యని యాశించుచున్నాను.

దివాకర్ల వేంకటావధాని

4-6-1974

నివేదనము

క్రీ.శ. 18వ శతాబ్ది ఉత్తరార్ధమున తెలుఁగు దేశమున జీవించి, ఆంధ్ర సాహిత్యమును తమ అమూల్యమైన రచనలచే సలంకరింపఁజేసిన మహాకవులలో శ్రీ దాసు శ్రీరాములుగా రొకరు. వారు న్యాయవాదవృత్తి చేపట్టినను ఆంధ్రభారతీ సమారాధనముమ సంతతము తమ కవితావృత్తిగా సాగించిన మేటిక వులు, గీర్వా ణాంధ్రాంగ్లభాషాకోవిదులు. శ్రీరామకవి కవితావ్యవసాయము శ్రీనాథ కవివలె పంద్రెండవ యేటనే ప్రారంభమైనది. శతకములు, ప్రబంధములు, పురాణములు, నాటకములు, శాస్త్ర గ్రంధములు ఇట్లెన్నో ప్రక్రియలలో వారు కావ్యరచనలు గావించియుండిరి. వారి శతకములలో సోమలింగళతకము, రఘునాధశతకము, సూర్యశతకము, చిలుకలకొలికి శతకము, ముద్దులగుమ్మ శతకము, సంస్కృత కామాక్షి శతకము మొద లగునవి ప్రసిద్ధములు. కావ్యములలో సాత్రాజితీ విలాసము, కృష్ణార్జున సంగరము, పంచనృసింహ క్షేత్ర మాహాత్మ్యము, లక్ష్మణావిలాసము, మొ॥నవి యెన్న దగినవి. తెలుఁగులో వీధి ప్రక్రియకు జెందిన ‘తెలుఁగునాడు’ ప్రత్యేకముగా, బేర్కొనదగినది వీరినాటకములలో మంజరీ మధుకరీయము, మనోలక్ష్మీ విలాసము, కురంగ గౌరీశంకరము, ఆంధ్రీకృత శాకుంతలము, రత్నా వళి, మహావీర చరితము, ముద్రారాక్షసము, ఉత్తర రామ చరితము మొదలగునవి ముఖ్యములైనవి. వీరి రచన లన్నియు నొక యెత్తు వీరి దేవీ భాగవత పురాణ మొక్కటి యొక యెత్తు. ఆంధ్రమున వెలసిన దేవీ భాగవతములలో దీనికున్న ప్రాశస్త్యమనన్య సామాన్యము. వారికి మహాకవి గౌరవము కల్పించు గంథ రాజము దేవీభాగవతము.

మహాకవి దాసు శ్రీరాములుగారు ఆధునికాంధ్ర కవిత్వ యుగకర్తలైన తిరుపతి వెంకటకవుల ప్రశస్తి నందిన వారు. వారి దేవీ భాగవతము, తెలుఁగునాడు కృతులలోని పద్యము లిప్పటికిని పండితుల నాలుకలపై

నాట్యమాడుచున్నవి. ఇంతటి ప్రజాదరణ పొందిన శ్రీరామ కవీంద్రుల కృతులిప్పుడు పాఠకలోకమున కందుబాటులో లేవు. వానిని పునర్ముద్రించి ప్రజలకందింప వలసిన యవసర మెంతైన కలదు.

ఈ యవసరమును దృష్టియందుంచుకొని, దాసు వంశమునందు జన్మించి ఆ మహాకవి యశస్సును వారసత్వముగా ననుభవించుచున్న మేమందరము కలిసి మహాకవి శ్రీ దాసు శ్రీరాములు స్మారక సమితి హైదరాబాదులో 1973వ సం॥ డిసెంబరు నెలలో స్థాపించితిమి. ఆ మహాకవి గ్రంథములను ప్రచురించుట ద్వారా వారి సాహిత్యమును నేటి తరమున కందుబాటులో నుండునట్లు చేయుట, వారిపేరు చిరస్థాయిగా నుండునట్టి ప్రజాహితోపకారములైన కొన్ని ప్రణాళికలను చేపట్టుట–అనెడి లక్ష్యములతో ఈ సమితి కృషి నారంభించినది.

మహాకవి దాసు శ్రీరాములు రచించిన 'తెలుఁగునాడు' తెలుగు నాట ఆబాల గోపాలము నలరించిన పద్యగ్రంథము. క్రొత్తపద్ధతిలో నడచిన వీధి. తెలుగు వారి నాటి యాచార వ్యవహారములను దెలియుట కుపకరించు కవితా కరదీపిక. అందువలన దాని నీ ప్రచురణ కార్యక్రమములో మొదటి గ్రంథముగా వెలువరించుట జరిగినది. ఆ తరువాత దేవీ భాగవతమును ముద్రింప వలెనని ప్రయత్నములు జరుగుచున్నవి. క్రమముగా వారి ముద్రితాముద్రిత గ్రంథముల నన్నింటిని ప్రచురించి ప్రజల కందించుట ఈ సమితి మొదటి ధ్యేయము.

ఈ సమితి కార్యకలాపములను తీర్చిదిద్దుటలో మాకు మార్గ దర్శకులైన పెద్దలు శ్రీ దేవులపల్లి రామానుజ రావు, ఆచార్య దివాకర్ల వేంకటవ ధాని, కళాప్రపూర్ణ ఆచార్య నిడదవోలు వేంకటరావు. డా॥ పాటిబంద మాధవశర్మ, డా. జి.వి. సుబ్రహ్మణ్యం, శ్రీ దిగవల్లి వేంకట శివరావుగార్లకు, మా సభా కార్యక్రమాలకు చేదోడు వాదోడుగా నిలుచుచున్న శ్రీ కృష్ణ దేవరాయ ఆంధ్రభాషా నిలయ కార్యనిర్వాహక వర్గము వారికి మా కృతజ్ఞతలు. శ్రీరామకవి ప్రచురణ కార్య క్రమమునకు ఆర్థికముగా సహాయపడిన వదాన్యులకు మా హార్దిక కృతజ్ఞ తాభివందనములు.

శ్రీ దాసు శ్రీరామకవిని గూర్చిన విశేషాంశములుగాని, వారి లిఖత ప్రతులుగాని, పాత ప్రచురణలుగాని ఎవరైన సేకరించి యున్నచో వానిని ఈ సమితికి అందజేసి ఆ మహాకవి సాహిత్య ప్రచురణ కార్య క్రమమును దిగ్విజయము చేయ ప్రార్థించుచున్నాము.

"తెలుఁగునాడు' నకు పీఠికను దయతో వ్రాసియిచ్చిన ఆచార్య దివాకర్ల వేంకటావధానిగారికిని, కవిపరిచయమును రచించి యిచ్చిన కళాప్రపూర్ణ ఆచార్య నిడదవోలు వేంక ట్రావుగారికి, ఈ గ్రంథమును సకాలములో ముచ్చటగా ముద్రించి యిచ్చిన శివాజీప్రెస్ వారికి మా కృతజ్ఞతాభి వందనములు.

మేము తలపెట్టిన ఈ ప్రచురణ కార్యక్రమమున ఆర్థిక ముగాను హార్దికముగాను సహకరించి ప్రోత్సహింపవలసినదిగా సహృదయ లోకమును ప్రార్థించుచున్నాము.

హైదరాబాదు
8-5-1974

దాసు పద్మనాథరావు
అధ్యక్షుడు
మహాకవి దాసు శ్రీరాములు స్మారక సమితి

కవి పరిచయము

– కళా ప్రపూర్ణ నిడదవోలు వేంకటరావు

ఆద్యతనాంధ్ర సాహిత్య జగత్తులో ప్రసిద్ధులైన కొందఱు కవి పండితుల శతాబ్ది జయంత్యుత్సవములు జరిగినవి. కాని కడచిన శతాబ్దిలో ఘన యశస్సు గాంచిన కొక్కొండ వేంకటరత్నం పంతులు, మండపాక పార్వతీశ్వర శాస్త్రి, గోపినాధం వేంకటకవి, వసురాయకవి (వడ్డాది సుబ్బారాయడు) మున్నగు వాని శతాబ్ధ జయంతులు జరుగనేలేదు. ఆ మహాకవి పండితుల కోవలోనివారే. దాసు శ్రీరామ కవీంద్రులు –

ఆధునిక వాఙ్మయ చరిత్రలో శ్రీరాములుగారి కింకొక విశిష్టత గలదు లౌకిక వృత్తిచే న్యాయవాదులయ్యు సాహిత్య ప్రపంచమున స్థిరకీర్తి నార్జించిన వారాకాలమున గలరు ... ఆంధ్రనాటక పితామహ ధర్మవరము రామకృష్ణ మాచార్యులు – ప్రధమ చారిత్రక నాటకకర్త కోలాచలము శ్రీనివాసరావుగార్లు న్యాయవాదులే. న్యాయవాది పట్టము బడసి ప్రభుత్వోన్నతోద్యోగులైనను భాషా ప్రపంచమునక సమానమగు సేవ గావించిన శ్రీ జయంతి రామయ్య పంతులు గారును స్మరణీయులు . ఈ దృష్టితోఁ జూచిన శ్రీరాములు గారికి నవ్యయుగ మున నున్నత స్థానము గలదు.

సంస్కృతాంధ్ర భాషలలో కవిపండితులగుటయేగాక, శాస్త్ర విద్వాంసు లగుటయు, శ్రీరాములు గారి యింకొక విశిష్టత – వారి సమకాలికులలో కొక్కొండ వారి తరువాత, కవిపండితులలో శాస్త్ర విద్వత్తుగల వారు శ్రీరాములు గారొక్కరే – వారికి ధర్మశాస్త్రము, భరతశాస్త్రము, జ్యోతిశ్శాస్త్రము మొదలగు శాస్త్రములందు మంచి ప్రావీణ్యము గలదు.

1901వ సంవత్సరమున (ప్లవ) నధిక మాస నిర్ణయమునుగూర్చి తెలుగు దేశమున జెడ్డ వివాదము చలరేగినది. ప్రఖ్యాత పంచాంగ కర్తలైన పిడపర్తి వారు అధిక మాసము వచ్చునని వాదింపగా, రాణి మహాగ్ని చిన్న నరసింహ

విద్వాంసులు (వీరే రాణీచయనులుగారని పేరు పొందినవారు) రాదని వాదించిరి. రాజమహేంద్రవరములో జరిగిన యీ నిర్ణయ సభకు, ఆంధ్ర దేశమున జ్యోతిష్కు లందరునూ వచ్చిరి. ఆ మహా సభకు శ్రీరాములుగారే అధ్యకులై, అధిక మాసము వచ్చునని తీర్పు చెప్పిరి. సభవారు వారి జ్యోతిశ్శాస్త్ర పాండిత్యమున కాశ్చర్య చకితులైరి.

సమకాలిక సాహిత్య ప్రక్రియల యందన్నింటనూ శ్రీరాములు గారు సిద్ధహస్తులు.

1. పురాణ ప్రక్రియ : వీరిక ముందు ములగు పావయారాధ్యులవారును, త్రిపురాన తమ్మయ్యదొర గారును దేవీభాగవతమును రచించిరి. కాని దాసువారి ఆంధ్రీకరణము తోడనే దానికి వ్యాప్తి కలిగినది. శ్రీరాములుగారి కృతి తరువాతనే పురాణ రచన తిరిగి ప్రారంభమైనది. జనమంచి శేషాద్రిశర్మగారు బ్రహ్మాండ పురాణము, ములుగు చంద్రమౌళిశాస్త్రిగారి లింగ కూర్మ పురాణములు వెలసినవి.

2. శతక ప్రక్రియ : ఈ ప్రక్రియలో వీరితరులకన్న నాలుగు విధములుగా ప్రత్యేకత చూపిరి .

1. సంస్కృత భాషలోనే శతకము రచించుట – కామాక్షి శతకము.

2. సంస్కృత శతకానువాదము చేయుట – సూర్య శతకము : సంస్కృతమున మయూర మహాకవి రచించిన సూర్యశతకము మహా ప్రౌఢకృతి. శ్రీనాధుడు కొన్ని శ్లోకములకు పద్యములు రచించి నాడు. కాని శ్రీరాములుగారు పూర్తిగా దీనిననువదించినారు. ఇది విశేషముగా నభినందింపదగినది. దీని ముద్రిత ప్రతి గౌతమీ గ్రంధాలయము (రాజమండ్రి)న గలదు.

3 . తెలుగు శతక రచనము : సోమలింగ శతకము, చిలుకల కొలికి శతకము, ముద్దులగుమ్మ శతకము. –

4. అచ్చ తెలుగు శతక రచన : చక్కట్ల దండ –

వీరి దేవీ భాగవతమున రెండు శతకములు సందర్భాను సారముగ గలవు.

3. నాటక ప్రక్రియ : ఇందునూ త్రివిధములుగా వీరు ప్రత్యే కతను ప్రదర్శించిరి.

1. అనువాదములు : శ్రీరాములుగారి సమకాలికముగా సంస్కృత నాటకాను వాదములు చేయుట పరిపాటియైనది. వీరు, రామ భద్ర దీక్షితుని జానకీ పరిణయమునూ, భవభూతి మాలతీ మాధవము, మహావీర చరిత్రలనూ ఆంధ్రీకరించిరి. వీనిలో మాలతీ మాధవము "సరస్వతి" అను పత్రికలోను, మహావీర చరిత్ర "మంజువాణి" అను పత్రికలోనూ ప్రకటితములై వవి. ఇంకనూ ముద్రారాక్షస, మృచ్ఛకటిక, రత్నావళి మంజరీ మధుకరీయము మున్నగు వానిని తెలిగించినట్లు తెలియుచున్నది.

2. స్వతంత్ర నాటక రచనము : మహాలక్ష్మీ విలాసము సీతా కళ్యాణము.

3. అచ్చ తెనుగు రచన : శాకుంతల నాటకాంధ్రీ కరణము అచ్చ తెనుగున నాటకము రచించిన వారు శ్రీరాములు గారు తక్క వేరెవ్వరు లేరు. [1]

4. ఖండ కావ్య ప్రక్రియ : అధునాతన ఖండ కావ్య ప్రక్రియకు నొక విధముగా ఆద్యులు వీరే.

వీరి 'తెలుగునాడు' అను ఆంధ్రవీధి స్వతంత్రమగు సాంఘిక కావ్యము. 14వ శతాబ్దిని క్రీడాభిరామము వెనుక వెలసిన సాంఘిక వ్యవస్థను నిరూపించు కృతియిదే. క్రీడాభిరామములో చరిత్ర, సాంఘిక ప్రవృత్తులు రెండూ కలసి యున్నవి. తెలుగు నాడులో నితివృత్తము కేవలము సాంఘికము – దాసు వారి కృతులలో హెచ్చు ప్రచారము బడసినది తెలుగునాడే.

ఈ నవయుగములో సాంఘి కేతివృత్త రచనకిదియే మొదలు దీని తరువాత ప్రసిద్ధమైనది భోగరాజు నారాయణమూర్తిగారి పండుగ కట్నము.

5. వచన ప్రక్రియ : ఆ కాలమున గ్రాంధిక వచన రచన చేయుట వ్యాప్తిలో నుండెను. శ్రీరాములుగారి "అభినవ గద్య ప్రబంధము" చిన్నయసూరి గ్రాంధిక శైలిలో రచిత మైనది.

---

1. చూడుడు – ఆంధ్రనాటక వికాసము – డాక్టరు పి. యస్. ఆర్. అప్పారావుగారు.

6. శాస్త్ర గ్రంథములు : తెలుగులో శాస్త్ర గ్రంథ రచన శ్రీరాములుగారి కాలమున ప్రారంభదశలో నుండెను. వారు తమ అభినవ కౌముది, తర్క కౌముది, వైశ్యధర్మ దీపిక, సారసీల గ్రహ గణితము (గణిత శాస్త్రము), అభినయ దర్పణము (నాట్య శాస్త్రము) మున్నగు రచనలచే నీ గ్రంథరచనకు నెంతో దోహదము గావించిరి

7. పద కవిత్వము : శ్రీరాములుగారు పద్యకవిత్వ మందెంత ప్రవీణులో, పదకవిత్వ రచనము నందంత దిట్టలు. వీరు పదములనేగాక జావళీలను విశేషముగ రచించినారు. వీరు సంగీత నాట్యనాటకశాఖలకు చేసిన సేవగుర్తించి సంగీత నాటక అకాడమీవారు నాట్యకళలో వీరిని గూర్చి వ్రాసినారు.

ఇట్లు సప్తవిధ సాహిత్య ప్రక్రియలను సాధించుటయేగాక, వారు కవితా రచనయందు స్వతంత్రత వహించిరి. ప్రాచీన కవుల పోకడలను జీర్ణించుకుని, లక్ష్యలక్షణ వివేచనతో కవితారచన సాగించుట వీరి కావ్యములో ముఖ్య లక్షణము. 1. రేఫ ఱకారముల ప్రాసలో నుపయోగించకూడదు 2. పూర్వకవి కృతపద జాలమునే వాడవలెను. 3. పూర్వకవి భావముల ననుసరింపవలెను అన్న లాక్షణిక నియమముల నన్నింటిని వీరు చర్చించి స్వతంత్రము, సజీవము – జాతీయము నైన రచనా రీతిని తమ గ్రంథములలో సుప్రతిష్ఠితము చేసినారు. పై విషయములు వారు దేవీ భాగవత పీఠికలో చర్చించినారు.

వారికాలమున శబ్దరత్నాకరము కవులకు ప్రధాన గ్రంథముగా నుండెడిది. వసురాయకవిగారి ప్రక్క నెప్పుడును శబ్దరత్నాకర ముండెడిది. కవి పండితులలో, అందలి పదముల నేతప్ప వాడకూడదని అభిప్రాయము బలీయమై యుండెడిది. శ్రీరాములుగారు స్వతంత్రించి ఇస్త్రి, రుమాలు, లింగకాయ మున్నగు వ్యావహారిక పదములను ప్రయోగించి వానికి గ్రాంధిక తావస్థ చేకూర్చినారు[1].

కవియే భాషా'ను శాసకుఁడు

కవి ప్రయోగ మూలము వ్యాకరణము

అని వీరి సిద్ధాంతము.

ఆద్యతన కాలమున స్వాభావిక వర్ణనలకు వీరిది పెట్టిన పేరు. దేవీ భాగవతమునందు "అల్లూరి పల్లెటూరి వర్ణన" ఆంధ్ర కావ్య వర్ణనలలో నను కరణీయమైనది. ఆ వర్ణన ననుసరించి నేను పల్లెవర్ణన గావించితిని.[2]

వీరు స్వతంత్రులు, మహాకవులు గావున వీరి గ్రంథములను సావధానముగా నధ్యయనము చేసిన మనకు నేడు, నిఘంటువుల కెక్కని పదములు, పలుకుబళ్ళు, కవితా సంప్రదాయములు నవేలముగా లభింపగలవు.

ప్రాచీన భావ సమన్వయము

సాహిత్యమున కొక్కొండ వారివలెనే – శ్రీరాములు గారు సంఘమున ప్రాచీన సంప్రదాయములను, నవ్యసంస్కారముతో సమన్వయము చేసిన వారు. పాశ్చాత్య నాగరికతా సంసార విశేషములను గ్రహించి వానిని, మన ప్రాచ్య సంప్రదాయ సారముగా సమన్వయించి దేశ పురోభివృద్ధికి తోడ్పడినారు.

ఆధునిక సాహిత్య యుగ ప్రక్రియలన్నింటియందు, బహుముఖ ప్రజ్ఞతో తమ ప్రత్యేక గరిష్ట స్థానమును ప్రతిష్టించిన వారు శ్రీరాములుగారే.

చెళ్ళపిళ్ళ వారన్నట్లు, శ్రీరాములుగారు–సరసకవి, విద్వత్కవి, స్వతంత్ర కవి, ఆశుకవి, దాత, నేత –

రచనలు

వారు 33 గ్రంథములు రచించినట్లు దేవీ భాగవతావతారికలో చెప్పుకొన్నారు. ఆ గ్రంథములు ముద్రితములైనను, నేడు లభ్యమగుట లేదు.

దిగవల్లి వేంకటశివరావుగారు చెప్పినట్లు వారిజీవితము, ఉదార భావములు. వారి సంతతి వారి కేగాక – ఆంధ్రులందరికి మేలుబంతులు.

---

1. వీనిని నేను శబ్దరత్నాకరము – అనుబంధమున చూపినాను.

2. చూ. మించుపల్లి.

సూచనలు

1. శ్రీరాములుగారి జీవిత చరిత్రను వారి కుమారులు విష్ణు రావుగారు 700 అరటావు పుటలలో వ్రాసినారు. అది ముద్రితమగుట అత్యావశ్యకము. ఈనాడు మనకు నవ్యయుగ సాహిత్య చరిత్ర లేదు. అట్టి గ్రంథములు బయలు వెడలిన- పై చరిత్ర కెంతో ఉపయోగము.

2. వారి గ్రంథములన్నింటిని సేకరించి, ఒక కేంద్రమున హైదారాబాదు నందుంచుట. అప్పుడు ప్రత్యేకముగా సాహిత్యోపాసకులు కొందఱు వారి గ్రంథములామూలాగ్రముగా చదివి సమీక్షలు ప్రకటించి, వారి ప్రతిభ లోకమునకు వెల్లడించుట కవకాశము కలుగును.

3. విశ్వవిద్యాలయములలో పరిశోధన : ఈనాడు విశ్వవిద్యాలయములలో నవీన యుగమున మహాకవులను గూర్చి పరిశోధన జరిపి సిద్ధాంత వ్యాసములను (Thesis) రచించి, పట్టములు (Ph.D.) పొందుచున్నారు.

దాసు (శ్రీ రామ మహాకవి ఆయన రచనలు. అను విషయము పై విశ్వ విద్యాలయములలో పరిశోధన చేయించెదరని భావించుచున్నాను, శ్రీరాములు గారి వలెనే కొక్కొండ, మండపాక, గోపీనాథ వారలను గూర్చి విశ్వవిద్యాలయములలో పరిశోధన జరుగవలెను.

ఆరు వేల పద్యసంఖ్యను పైఁబడిన దేవీ భాగవతము నాఱునెలలో, తనవృత్తి ధర్మమును నిర్వహించుచు, సంపూర్ణము చేసిన శ్రీరాములు గారి ప్రతిభ అనితర సాధారణము.[1]

వారు వ్రాయునపుడు బాతు కలము నుపయోగించెడి వారని ఆంధ్రపత్రిక 1918 సంవత్సరాది సంచికలో వారి ఛాయచిత్రమునఁ కలదు. అందు వారు లౌక్యవృత్తి వేషముతోఁగాక - గృహస్థు వేషముతో నున్నారు. వారి కుమార్తె, కవయిత్రి శారదాంబగారు కూడ అందుఁ గలరు. ఇట్టి ఛాయచిత్రములను సేకరించవలెను.

---

1. నియోగి సర్వస్వము 76,78

ఆంధ్ర మహాజనులు, శ్రీరాములుగారి గ్రంథములు పునర్ముద్రించుట కేగాక, పై సూచనలను ఆచరణలో పెట్టి అవి పూర్తి యగు టకు తోడ్పడుదురుగాక అని విన్నవించుచున్నాను.

పీఠిక

ఆ యీ తెలుఁగునాడు నేఁటికి సుమారు 60 యేండ్ల నాఁడు కీర్తిశేషులు శ్రీ దాసు శ్రీరామ మహాకవిగారు విరచించిరి. వా రిద్దానిని రచించు నాటికి మేము (తి।। వెం।।) శ్రీ చర్ల బ్రాహ్మయ్య శాస్త్రులవారి సన్నిధిని (కడియెద్ద గ్రామములో) వ్యాకరణశాస్త్ర మభ్యసించుచున్నారము. కవిగారి నివాసమైన యేలూరికి మేము అనధ్యాయపు రోజులలో వెళ్ళు చుండువారము. వెళ్ళినప్పుడు శ్రీకవిగారికి నతిధులముగా నుండువారము. ఆకారణముచే దీనిని రచించు సమయమునకు కాకతాళీయముగా మే మచ్చటనే యుండుట తటస్థించినది. తీవ్రమైన బుద్ధిబలము కలిగి యున్న వయస్సులో నుంటచే దీనిలోని పద్యములు చాలవఱకు. నాకుఁ గంఠపాఠమైనవి, కొన్ని పద్యములు. –

(1) తాతలనాఁటి సాలువులు (2) నమ్మిన నమ్మకున్న నది 'నావశమా? (3) విడువకురా ఉతోతఇషవేనమరా! అది దుడ్డురా ముణాఃకొడుక (4) లేవరు లెండులెం డనిన, (5) అస్సే చూస్సివషే, (8) మెలిపెట్టి విడిచిన మీసాలపై లోనై నవి నా కిప్పటికిని సంధ్యావందన ప్రాయముగా వాచోవిధేయములుగా నున్నవి. కనుకనే తొలిముద్రణములో నుండి యిటీవల నే కారణము చేతనో లోపించిన –

శా।। **సర్వజ్ఞత్వము సాంబమూర్తిది మనుష్యప్రజ్ఞ యల్పంబు దు**
ర్గర్వంబుల్ కొఱగావు దూషణల మోక్షశ్రీలు చేకూర వీ
యుర్విన్ ఖానికుఁ డెన్నిరాళ్ళు వడపోయుఁ్రరత్న మొక్కంటికై
గుర్వర్థం బొఁక దున్నజాలదె? సుధీకుంభుల్ విచారించినన్.

ఆనుపద్యము నీ ముద్రణమున, జేర్పగల్గితిని. నా యీ జ్ఞాపకమునకు గ్రంథకర్తగారి మనుమఁడు పద్మనాభరావుగారు కూడఁ దోడ్పడినందులకు సంతసించుచు నాయలఘు నాశీర్వదించుచు దీనిని ముగించుచున్నాడను

చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రి, శతావధాని

పీఠిక

శ్రీనాధుని 'వీధినాటకము' ననుసరించి కొంతవరకు వ్రాయబడినప్పటికి దానికిని నా పుస్తకమునకును అనేక విషయములలో భేదమున్నటులఁ జదువరుల కందరకు విశదము కాఁగలదు. శ్రీనాధుని వీధిలో నాంధ్ర స్త్రీవర్ణనము మాత్ర మతి శృంగారముగా వర్ణింపబడియె. ఈ నాపుస్తకములో శ్రీనాధునిలో నున్న యాయతిశృంగారము గానరానీక తెనుఁగు దేశపువారల ప్రకారములు మాత్రము కొంచెము చమత్కృతితో స్వాభావిక ముగా వర్ణించితి. ఈయది తెనుగు దేశములలోఁ గల ముఖ్య వర్ణములవారిని వర్ణింప నుద్యమించిన నా "తెలుఁగునాడ'ను మహావీధిలో 'బ్రాహ్మణ ప్రశంస' యను ప్రథమభాగము. ఇందు ఆంధ్ర బ్రాహ్మణులలోని పలు తెఱఁగులవారి కులవర్తనములు, ఆచార వ్యవహారములు, వేష భాషలు మున్నగునవి వ్రాయఁబడియుండె. ఇందొక తెగను గుఱించి వ్రాసిన వర్ణనలు మఱొక తెగవారికి సంబంధించు ననియు నియ్యది నిష్పక్షపాత బుద్ధితో వ్రాయబడియుండలే దనియుఁ గొంద అందురేమో. కవిత్వపు పస చెడకుండ సాధ్యమైనంత నిష్పక్షపాత బుద్ధితో నా శక్తి కొలఁది వర్ణించి యుంటినేగాని వేరొండు గాదని చెప్పగలను. ఇదియునుంగాక మన దేశములో బ్రాహ్మణజాతిలోఁగల వివిధశాఖలవారు అనవసరముగాఁ గల్పించుకొను వివాదలు తగ్గింపవలెనని నా యుద్దేశము. బ్రాహ్మణశాఖలలో వివాహ సంబంధము లుండుట శ్రేయోదాయకమని నా యభిప్రాయము. ఈ యభిప్రాయమును ఈ పుస్తకమందేగాక యింతకుముందు నాచే రచింపఁబడిన యితర గ్రంథములలోఁగూడ వెల్లడిచేసితిని.

ఈ పుస్తకపు తుది భాగము నే గ్రామాంతరమున నుండు నవసరమున ముద్రింపఁబడిన దగుటచే నచ్చటచ్చట గొన్ని ముద్రాస్ఖాలిత్యములు దోపవచ్చును. అట్టివానిని రెండవ కూర్పున సరి చేసికొందును.

సంఘవిషయములఁగూర్చి అబాధకములగు చమత్కార కావ్యములు మన దేశ భాషలలో లేవు. ఐరోపాఖండమువారి ప్రస్తుత నాగరిక ప్రవర్తనమునకు

కారణభూతములై నవి యిట్టి కావ్యములేయని నేను జెప్పనవసరము లేదు. కనుక చదువరు లారా! యీ పుస్తకమున నుండు విశేషములను, వర్ణనలను గురించి మనసున వేరుగాఁ దలంపక నాయుద్దేశము నాలోచించి మన్నించి చదివి తక్కిన భాగములుకూడ త్వరలో వెలువడు నటుల నన్ను ప్రోత్సాహ పఱచెదరని నమ్ముచున్నాను.

ఏలూరు,

15-7-1899. **దాసు శ్రీరాములు**

PREFACE

Though written somewhat after the fashion of *Sri Nadha's Veedhi* this book has deviated from it in many points as the reader will see. My book, unlike *Srinadha's*, is not confined to a description of the peculiarities of Telugu Women and it is moreover free from the morbid taste which is met with in the pages of *Srinadha's* book. This pamphlet termed the *"Brahmana Prasamsa"* treats of the Brahmins and forms the opening chapter to my intended work viz. a description of all the principal castes of the Telugu people. It might be said by some that I am not altogether impartial and that the remarks applied to one sect may, with equal truth and force, be applied to another. To this I can only say that I am as impartial as I can be and that poetic fancy can not be altogether judged by any hard and fast rule. I may also say that among others it is my object in writing this to smooth down the many and unpleasant differences between sect and sect and in fact in this, as well as in some of my previous books, I have ventured to preach my pet exhortation-Inter-marriages among sub-sects of Brahmins and their advantages.

In the latter portion of the book which has been printed during my absence in a distant place one may find wrong punctuation here and there and I beg to say that such will be carefully corrected in the second edition.

In conclusion I beg to point out that there is a great need in Vernacular Literature of books containing witty and painless observations on social matters; it is such literature that has done so much in moulding the present polished manners of European countries I therefore beseech my readers, to take the remarks contained herein in the spirit in which they are offered and to encourage me to bring out the other parts of the work.

ELLORE
15-7-1899.

DASU SRIRAMULU

శ్రీరస్తు

తెలుఁగునాడు

(స్తుత్యాదికము)

శ్రీపరమున్ మహేశుని భ
జించి రసంబు ఘటింపఁ గాళహ
స్తీపురమున్ బురాణ పురి
శ్రీగిరి యెల్లలుగాఁ దలిర్చు నా
నాపుర మానితం బయిన
నాఁటఁ జెలంగు దెలుంగుఁబల్లెలన్
గాపుర ముండువారల ప్ర
కారము వీధి యొనర్తుఁ గ్రొత్తగన్.

ఉ. లోకవితాన మేలు పరలోక విభుం డఖిలంబు గూర్చెనో
నా కవితాకునన్ ధనమునం బరితృప్తులు గాక నిక్కువా
రా కవితారసంబు లెనయంగల రద్దమరేయి దొంగకున్
రా కవితంబ యయ్యవి నిరాకుల చిత్తులపాలి భాగ్యముల్.

చ. తెలుఁగునఁ దేట తెల్ల ముగఁ దెల్పినమాట వరాలమూటగాఁ
దెలుఁగున మాటలాడు మనదేశపువారు గణింతు రందుకై
తెలుఁగనునాఁటివారల నుతింప నతిశ్రమ మంచు నెంచకే
తెలుఁగున వీధి సేయఁదగదే ధని మెచ్చిన మెచ్చుగల్గునే.

కం. కులవర్తనముల నానా
కలనము లాచారముల ప్రకారము లందం
బులఁ జందంబుల నుడుఁగుల
పలు తెఱఁగులు నిందుఁ జెప్పఁబడుఁ గడువేడ్కన్.

చ. ఇది నవవీథి దీనికి ననేకరసంబు లనేక నాయకుల్
పదపడి మంచిచెడ్డలును బాగులు నోగులు మేళ్ళుఁగీళ్ళునుం
గొదవలు గొప్ప లంధ్రజనకోటికి నెట్లగు నట్లు నెప్పెదన్
మదిఁబరికించి కోపమును మానుఁడునానుడుఁగానుఁడూరకన్.

ఉ. ఉన్నది యున్నయట్లు మధురోక్తులఁ జెప్పిన కబ్బ మెప్పుడున్
బన్నమునొంద దందఱును బాగని మెత్తురు, లేనిపోని దం
ధన్నలు కొన్ని పన్నుక కతల్ వెదఁబెట్టిన నేమి, యన్నెమా?
పున్నెమ? పూరుషార్థమ? బుభుక్షువు సేసిన బ్రాహ్మణార్థమా?

సీ. భాషీయపద్ధతి పట్టుదప్పఁగ నీక
దీర్ఘ సమాసంబు తెరువుపోక
గూఢార్థసమితి దిక్కును దేఱిచూడక
స్పష్టార్థములజాడ జాఱనీక
మఱుఁగు పదంబుల మార్గంబు ద్రొక్కక
తేటమాటల రాచబాట విడక
దూరాన్వయంబుల దారి మూచూడక
సంకరాలంకార సరణి గనక

గీ. ఉన్నయది ఉన్నయట్టులు గన్నయదియుఁ
గన్నయట్టులు విన్నది విన్నయటులు
నన్నయది యన్నయట్టులు వన్నె వెట్టి
కవితఁ జెప్పిన సంతోష మవు జగాన.

సీ. ఉచ్చరించినమాట యూఁకొన్న మాత్రనే
యెట్టిదో తాత్పర్య మెఱుఁగవలయు
నెఱిఁగి డెందానఁ జింతించిన మాత్రనే
దృష్టాంత మొకటి స్ఫురించ వలయు

స్ఫురియించి సరిఁజూచి పరికించుమాత్రనే
దొసఁ గిందు లేదని తోఁచవలయు
తోఁచి యొక్కింత యాలోచించుమాత్రనే
"యౌరా! యథార్థమే" యనఁగవలయు

గీ. స్వస్తుతియుఁ బక్షపాతము సంప్రదాయ
భంగమును, మత్సరము, శాస్త్ర బాధ, నీతి
లోపమును, నింద, కతినోకి దోఁపరాదు
కవి జగచ్ఛ్లాఘనీయమౌ కవిత గూర్ప.

ఉ. ఓరుపులేని వాఁడను మహోద్యమ మిచ్చి సుధీముఖంబునం
దీరుపులేనివాఁడను, విధిచ్యుతి లేని కృతిన్ రచింపఁగా
నేరుపులేనివాఁడను, గుణిప్రకరం బెపుడై న నిందు నా
కూరుపుఁ జూచి చీ! యనునొకో? తలపెట్టితి నేమి సేయుదున్.

ఉ. లోకములోని యెల్ల నరలోకముల న్నిఖిలప్రవృత్తులం
దేకముగా సృజించెను మహేశుఁ డటంచుఁ దలంచి యెవ్వఁడా
లోకము సేయు, వాఁడె యతిలోక మతిక్రముఁ డంచు గీతలం
దాకమలాతరంగవిభుఁ డర్జునుతోడ వచించె వింటిరే?

ఉ. నందుని నందనుండు విడనాడె భువి, న్గలి వచ్చె నాఁడె య
న్నందున నాఁటనుండియును నాలుగు దొమ్మిది తొమ్మిదీరువో
నందననామవత్సరమునన్ శుభపౌష సితాష్టమిన్ ధరా
నందననామవాసరమునన్ దొరకొంటిని దీనిఁ జేయఁగన్.

కం. పదునెనిమిదివందల తొం
బది రెండగు నాంగిలేయ వత్సరమున ని
ర్వదియెన్మిదవ డిశంబరు
మొదలుగ నివ్వీథిఁ జెప్ప మొదలిడితి వెసన్.

తెలుఁగునాడు

బ్రాహ్మణ ప్రశంస

వైదికులు

చ. వచనములందు మార్దవము, వస్త్రముల న్మడి, వంటకంబులన్
బచనము సేయు చేతిపరిపాటి, శ్రుతిస్మృతిచోదితక్రియా
నిచయమునందు భక్తి, గృహిణిన్ సుఖ పెట్టుట, వాసవాటికా
శుచితయు వైదికోత్తముల సొమ్మనవచ్చు నసంశయంబుగన్.

సీ. చదివిరా! ఋగ్యజు స్సామముల్ భూర్భువ
స్సువరాది లోకముల్ స్తుతులు ముట్టు
మెదపిరా! పెదవి గుంఫిత మృదు స్తుతిపాఠ
సల్లాపముల నల్ల రాళ్ళు గఱఁగు
తలఁచిరా! క్షేత్రయాత్రలు సేతు కాశికా
గంగోత్తరలకు మూఁ డంగలీడు
నిలిచిరా! సత్కర్మనియతి న్మహాధ్వర
కాండంబు పౌండరీకంబుదట్టు.

గీ. పఱచిరా! పంచపాళి దర్భాసనములు
ముక్కుమూఁతల సరిపుత్తు రొక్కజాము
బళిర! యీపాటి పరిపాటి దెలుఁగునాఁటి
వైదికునితోటి యేమేటి వచ్చు సాటి.

చ. శమము దమంబు శౌచమును సత్యముశ్రౌతము స్మార్తమున్ మృదు
త్వము సరసత్వ మార్యజన వందనతృప్తి విగర్హిత క్రియా
విముఖత యప్రమాదము వివేకము నీశ్వరభక్తి నిశ్చల
త్వము నిరపాయజీవనము వైదికవృత్తిని మించ నున్నదే.

ఉ. నీళ్ళకు నిట్టితోళ్ళకును నేతికరుళ్ళకు దొడ్డయుత్తరేణ్
వేళ్ళకు దర్భముళ్ళకును వేదపునోళ్ళకు సన్నకుట్టు వి
ప్తళ్ళకు రావిపేళ్ళ కనిశంబును మళ్ళకు పప్పుఁగూర ప
చ్చళ్ళకు రాగిబిళ్ళకును సంతసమందుదు రాంధ్రవై దికుల్.

ఉ. తాతలనాఁటి సాలువులు దాపటివంక బుజాలపైఁ గడుం
బ్రాతఁదనానఁ జిన్గులగు బాటగునం చొకయింత వింతగా
మూఁతమడంచి వైచి మొగము లెగఁబూసినబూది జాఱఁగాఁ
జేతుల ఝూరు లొప్ప ధనిఁ జేరఁగవత్తురు వైదికోత్తముల్.

చ. తెల తెలవాఱఁ గాల్యములు దీరిచి స్నానముఁ జేసి బూది మై
నలఁది కుశాసనంబుల నొయారముమీఁఱఁగఁగూరుచుండి ని
శ్చలమతి సంధ్య వార్చి విలసజ్జపమాలిక వ్రేళ్ళఁ ద్రిప్పుచున్
మిలమిలఁ గన్నుదోయిని నిమీలనవైతురు వైదికోత్తముల్.

చ. విడువకురా! "ఉతోత ఇషవేనమ"రా! అదిదుద్దురా ముణాః
కొడక? యటన్న మాట విని కొంకి "ఉతోత ఇసే; నమంచు శి
ష్యుఁడు" దనవెంట రా వడఁకుచుం గుడిచే నొకయక్షమాలచొ
ప్పడ నొకచేత దండమిడి బాటను వైదికవృద్ధుఁ డేగెడిన్.

ఉ. త్రుళ్ళఁగ నీరుకావి మడిదోవతికమ్ములు వ్రేళ్ళబిళ్ళ కు
చ్చెళ్ళిడి కట్టి నీళ్ళబుడిచెం బొకచేతనుఁ బట్టి దారిలోఁ
జిళ్ళల కొత్తుకొంచు నొకచేఁ దడికొళ్ళయిఁ బెట్టి పెళ్ళిపం
దిళ్ళకు భోజనాన కరుదెంచును వైదిక శేఖరుం డిలన్.

సీ. మోకాళ్ళు దాఁటని మొరటు గావంచాల
నందియందనిగోఁచి యంటదోపి
పిల్ల గాలికిఁ దూఁగి యల్లాడు చిన్న నే
రెడుగాయవలె జుట్టు ముడియ వైచి

నడునెత్తి పెడచెంప లెడనెడఁ గాన్పింపఁ
దల నొక్కయంగవస్త్రంబుఁ జుట్టి
గీరు గంధపు రేఖ దీరైన నొసటి పై
పసపక్షతల చుక్క యెసఁగ నునిచి.

గీ. బెదరి చూచుచుఁ బెజవారి కొదిగి కొనుచు
జందెపోగులు చిక్కువోఁ జమిరికొనుచు
నోట నొకబుక్కు ముమ్మాఱు నొక్కి యనుచు
శ్రోత్రియ క్షితిదేవతాసుతుడు వెడలు.

ఉ. లేవరు లెండు లెం డనిన, లేచినవారయినం దటాలునం
బోవరు, పోవుచున్ నిలిచి పోదుముపోదుము త్రోయకుండటం
చీవరు సందు గేస్తు నలయింతురు పెండిలిలో సదస్య సం
భావననాఁడు చూడవలె బాపన సాములసాము లన్నియున్.

చ. అనుదిన మంగపంచకము నందఱికిన్ వినుపించు బాపఁడా
దినమును వారబుక్షములు దెల్పు మఱిం గరణంబు యోగమున్
వినఁబడఁ జెప్పి త్యాజ్య మొక వింతగ నీడిచి చెప్పి పైపయిన్
బనీగొని "రావె కేవే" యని పాఱున దేమిటి చెప్పుమన్నదా
వినఁ డవి రాహు కేతువుల వేధ లటంచు నెఱుంగ కజ్ఞుఁడై.

ఉ. సత్తుగ దేవతార్చనపు సంచుల నున్నని వేల్పు రాళ్ళకున్
వత్తులు గాల్చి పూవు లిడి వాసనదూపిడి గంటగొట్టి మా
కత్తెసరంచు లౌక్యులగృహంబుల జొచ్చిన వైదికోత్తముల్
కుత్తుకనిండఁబచ్చడియు గోరస మన్నము దింద్రు నిచ్చలున్.

శా. గంగాజోస్యులవారు మీకును నమస్కారంబంటంచు న్వెసన్
వేంగప్పంతులుగారు పల్క వినుచున్ వేదోక్తమాయుష్యమం

చుం గేల్దోయిని జాచి పల్కి నగికొంచున్ భోమహారాజ! యే
భంగిన్ మాబ్రతు కెల్ల మీదని స్తుతింపజొత్తు రాశ్రోత్రియుల్.

మ. నిను నే మెచ్చిన మెచ్చులా? యన్నృతమా! నీకల్పవృక్షంబునీ
డను నీజందెపు చాటునం బ్రతుకువాఁడన్ గొప్ప సంస్థాన మెం
దునఁబోనేసిన మీవె మాయమృతమస్తుల్ మాప్రభో! పేదవాఁ
డను గాపాడు మటంచ్రు వైదికులబిడ్డల్ లౌక్యులం గాంచినన్.

సీ. ఉదయించుచున్న సూర్యునివంటి గుండ్రని
ముతకకుంకుమబొట్టు మొగమునింద
కొయ్యకరాటానఁ గొని వ్రేల మెదిపి రా
చిన నూనెకాటుక కనులనింద
అట్టిట్టు గదులాడునట్టి మేల్ముత్యాల
ముక్కుపో గొకప్రక్క మూతినింద
గోటంచుతో బొద్దుకుట్టు గుట్టిన గట్టి
పై రిణీ, మోచేతిపట్ల నింద.

గీ. మాలనూలును చీరెల సాలినేఁత
మూరగలిగిన దళముగాఁ బుంజ మిడిన
మేలికమ్మె సొగసుచీరె మేనునింద
బ్రియుఁ గదియుఁ దెల్గునాఁటి శ్రోత్రియ వధూటి.

శా. ఆస్సే! చూస్సివషే; వొషే; చెవుడ షే అయిగషే; యేమిషే;
విస్సావఝులవారిబుట్టినష యా విస్సాయ కిస్సారు షే
విస్సం డెంతటివాఁడె యేళ్ళపదిషే; వెయ్యేళ్ళ కీడేషమా;
ఓస్సే బుట్టికి యీడషే; వొయిషు కే ముంచుందిలే మంచివొ
ర్ఛెస్సే; యందురుశ్రోత్రియో త్తమపదస్త్రీ లాంధ్రదేశంబునన్.

సీ. కోడికూయఁగ మేలుకొని తలవాకిలి
పై పాచిజిమ్మి కలాపిఁ జల్లి
దడదడగా దంతధావనం బొనరించి
యిల్లల్కి ముగ్గిడి యెనుముఁ చిదికి
పొరుగింటి కేగి నిప్పును దెచ్చి రాజేసి,
మడివలువల నుత్కి పిడిచి మడఁచి
బుజముపై నిడి దండెముల నాఱవై చి కూ
రలు దర్గి కొనియు దండులము లోడ్చి
పసుపు రాచుక నీళ్ళు పైఁబోసికొని బట్ట
తడిది గట్టుకొని తీర్థంబు దెచ్చి
నాలుగు సేర్ల తప్పేల దబ్రాగిన్నె
రాచిప్పయొకటి పొయ్రాళ్ళఁ బెట్టి.

గీ. కళపిళ నెసళ్ళు గ్రాఁగించి కమ్మనైన
వంటకా ల్చేసి విస్తళ్ళ వడ్డనములు
పొసఁగఁ గావించి భయభక్తి పూర్వకముగ
నుపచరించును వైదికయువతి పతిని.

చ. వసుధ నియోగి బాలికను వైదిక బాలున కిచ్చి చేయఁగా
బస నది యిట్టునట్టనిన బాగషునిష్షను మంచు నత్తయ
బ్బెసమొనరింప నొక్కతతి పీషష? పెష్షష? మామగారికిన్
మసలక "పెష్ను పెష్ను" మను మాషలెపల్కెనషంద్రుగష్షిగన్.

ఉ. పావనమైన వైదికుల భాష గొఱంతలు పట్టి తెల్పుట
బ్బా! వినరాదుగా జెఱకు వంకరబోయిన యంతమాత్రనే
పోవునె తీపి! కొందఱిది పోల్పరు వై దికుపిల్లి ప్రత్తి మ్రేవ్
మ్రే వనునంద్రు రేఫమది శ్రీకరమున్ శిఖిబీజముం గదా.

నియోగులు

చ. బడిపడిఁ బాంథబాడబులు బ్రాహ్మణగేహము గోరుచున్న నీ
నడువడియెల్లఁజూడు కరణాలను బ్రాహ్మణు లందువా; సరే
వడి నడువీధిలో నిలకు వచ్చినదారిన పొమ్ము పొమ్మటం
చడుగునఁబుట్టుమంట తల కంట నదల్తురు లౌక్యభూసురుల్.

సీ. మెలిఁబెట్టి విడిచిన మీసాలపై గొప్ప
నిమ్మకాయలు రెండు నిలుపవచ్చు
తేటగాఁ దెల్లగా తెగఁగాలు లంకాకు
పొగచుట్ట జుంజురుఁ బోల్పవచ్చు
నడువీధి రెడ్డిగా లిడి రచ్చ దీర్చుచో
సివిలుజడ్జీ లని చెప్పవచ్చు
అసదుగాఁ బొసఁగించి నొసటఁ బెట్టిన బొట్టు
లొక్కమా "ఉప్పని యూఁ" దవచ్చు.

గీ. వడివడిగఁ జిన్ననాఁడైన వడుగునాఁడు
తడఁబడుచుఁ జెప్పుకొన్నట్టి తప్పుసంధ్య
ముక్క నాలుగు నిముషాల ముగియవచ్చు
బళిర! యనవచ్చు లౌకిక బ్రాహ్మణులను.

గీ. జ్ఞానాధిక్యము, శాంతి, యర్థిజనర క్షాదీక్ష, భూపాలకా
స్థాన ప్రాపిత వైభవంబు, పటుమంత్రప్రజ్ఞ యున్, సంతతా
క్షీణం బుగ్గునఁబెట్టు తల్లియె నియోగిబ్రాహ్మణశ్రేణికిన్
మానంబేనగ, మాటలే కవచముల్ మర్యాదలే భాగ్యముల్.

ఉ. ముచ్చిలి గుంటజుట్టుముడి మోయఁగ నెత్తిఁగుళాయి యిస్త్రీ
యిచ్చినకోటు మేన ధరియించి బుజాన రుమాలువైచి లేఁ
గచ్చను జీరుగోఁచి యిడి కట్టిన మల్మలు చెంగు జాఱఁగా
నిచ్చి చెడావులం దొడిగి యేగు నియోగిసుతుండు నిచ్చలున్.

ఉ. ద్వారముఁ జేరఁగానె యవధానులుగా రదె వచ్చిరే నమ
స్కారములండి రండి పఱచండి కుశాసన మౌనుగాని గో
చార బలంబు నా కిపుడు చాలునొ? చాలదొ? చెప్పుఁ డీ పరి
ష్కారముగా నటంద్రు సరసంబుగ వైదికుఁ గాంచి లౌకికుల్.

చ. కరణము మంత్రసాని; సరకారు ప్రసూతిక; రైతుబిడ్డ ని
బ్బరమగు వ్రాఁతకోఁతలు జవాబుసవాళ్ళును దంత్రయుక్తి బం
ధురముగ నూరిమీఁద నొక నూరయినంబడుఁగాక యెన్నఁడుం
గరణముమీఁదనొక్కయఱ కాసయినంబడదంద్రు మానవుల్.

చ. నిరుపమబుద్ధిశాలి కరిణీకముఁ జేసిన యూరికాపు లె
ల్లరు భువిఁబాలు బొంగినటుల న్మదిఁబొంగుచు 'దొడ్డవోఁడుమా
కరణముబిడ్డయింటఁ గలఁకాలము మేలగు' నంచు గంగఁగొ
ల్తురు; సరికానివా రతని దొడ్డిన మేపుదు రాలమందలన్.

చ. నడవడిమంచి వ్రాఁతకరణంబతఁడెప్పుడు వ్రాయుచుండఁగన్
దడదడమ్రోఁగుఁగూఁతకరణంబతఁడన్నిట సున్నయిందటిన్
దడఁబడఁజేసి మేఁతకరణంబు గుటుక్కున మ్రింగు నెల్ల రా
బడులును బెళ్ళికట్టములు బందరుపజ్జన కొన్ని యూళ్ళలోన్.

చ. కరణము నంజనేల దరఖాస్తులకాలమె పంటకళ్ళ మం
చెరఁబడి చేయిసాఁప రయి తెట్ల నొ చౌలము పావు దెచ్చి య
క్కఱగడ తేర్చుమం చదుగఁగా "నెకరానికి మాడమేర కం
దఱునొసగంగ నీనొసటనా? యుదయించెనుప్రొద్దుపొమ్మనున్.

ఉ. ఓరీ! చాకలి కాళ్ళు గ్రుద్దు మని యె న్నోసార్లు నేఁ బిల్వలే
దా! రావేమిర? తిమ్మిరెక్కినదొ లేదా బుద్ధి నీచాకి రం
చేరేవో యిఁక జూఁడు నీమదము నా కెవ్వార లడ్డంబురా?
తేరా దస్త్రమటంద్రు గ్రామకరణా లీవ్ర ప్రభావంతులై.

శా. నమ్మిన నమ్మకున్న నది నావశమా! జను లాడుకొన్న వా
క్యమ్ములు నేను జెప్పెద భయంపడియో పడకో! నియోగిలో
కమ్మనివార్య కార్యఘటకమ్మవుఁగాని పరోపకార శూ
న్యమ్మను స్వప్రయోజనపరాయణమున్ దలపోయ నిద్దరన్.

చ. ముదికరణాలు రాముగుడి మోసల రచ్చలు దీర్చి భారతాల్
చదువుచు లోకవార్తల బ్రశంసలనంద్రు తెలుంగు భాషమం
చిది మనపిల్ల కాయలు వచించెడియింగిలిపీసు పుస్పుసన్
బెదవులు దాఁట దెంతటి యెఫేయుబియే యెమియే వచించినన్.

ఉ. ఈతటి జాతిరాచటిక మింతటి దుర్గతి దెచ్చెఁగాని మా
తాతహయాములో నుడుగు దాఁటినవారలఁ బట్టి తెచ్చి చ
ట్రాతను గట్టి కొట్టి పదిరాత్రు లటుంచిన రాజుతోడ వి
జ్ఞాతము సేయు వాఁడొకఁడుగల్గెనె యందురు వృద్ధలౌకికుల్.

ఉ. స్నానముఁ జేసి సంధ్య నిముసాననె దీరిచి బొట్టుఁ బెట్టి పీ
ఠానను గూరుచుండి యెఱడా లరివాణము జోడు చెంబులుం
దా నమరించి మంచియరఁటాకున నన్నము గూరగాయలున్
దాను భుజించు నై సినపదార్థము గొంచు నియోగి నిచ్చలున్.

గీ అడిగినది యిచ్చు త్యాగి సత్యమున సేగి
అన్ని గల్గినభోగి భార్యగలయోగి
చిలుమిడనిరాగి వండ నేర్చిన నియోగి
కంచు దివిటీలతోన జగాన గాన.

చ. గడబిడ చేసియైనఁ దనుఁ గట్టిగ మంత్రము సెప్పఁ డెప్పు డా
గడమునఁగట్టు సేయవలె గ్రామపురోహితు నంచు తప్పకన్
గడియలు లెక్కఁబెట్టి సరి కానిది యైనది చూచుకొందురే
బడబడఁ బాటఁ బాడినను బట్టఁగలేరు తెలుంగులౌకికుల్.

ఉ. యజ్ఞము సేయఁ గావలయు నన్నిటిఁగూర్చుఁడు నాఁ బురో హితుల్
ప్రజ్ఞలు గొట్టి యిచ్చినవరాలను గైకొని మీరు వేదసా
రజ్ఞులు యాజమానములు రావలె నందు రనంగ లౌకికుం
డజ్ఞులహో! కొనుండు మన కవ్వియు నాలుగుబండ్లనున్వెసన్.ఁ

ఉ. కేలఁ గలంబు వట్టిన వకీలుతనం బొనరించుచున్న నే
కాలము దీర్పుఁ జెప్పు, నధికారముఁజేసిన గాకితాలు ద
స్త్రాలగుఁ గాళ్ళుకాయలగుఁ దప్పకొడల్ కనఁగాచుకొన్న చూ
లాలిని బోలు క్షుత్తు చెడు లౌకిక విప్రులలోన నొక్కటన్.

చ. అనుపమ మేరుమందరగుహావళి మూయఁగవచ్చుఁగాని యీ
మనుజులనోరు మూయఁదరమా యనుకొం ౘది యంతపట్టున
మ్మనలవికో నియోగి తన, పచ్చయెకాని సహింపఁ దన్యప
చ్చ ననుచు దాని కేమి విరజాజులు రాజులునై త మట్ల నే.

మ. కొమరుంబాపట కడ్డమై మొగలిరే కుం దమ్మలంపాకు నం
దముమీఱన్ జడచుట్టపై నిడిన సాదాబిళ్ళపై ఁ బచ్చఱా
లు మురాళింపఁగ గూబకుట్టులునుఁ దాలూకాలఁ జిల్లాలమ
చ్చెములం దుద్దుల బుష్యరాగములఁ డాల్చిఁకట్లుపో మొత్తనె
య్యమున నృర్తల బ్రీతిగొల్పుదురు లౌక్యబ్రాహ్మణ ప్రేయసుల్.

స్మార్తసాధారణ విషయములు

ఉ. కమ్మనిమాట యొక్కటి సుఖమ్ముగఁ జెప్పెద నాలకింపుఁడీ
యెమ్మెను భోజనంబులకు నేదయినన్ శుభకార్యవేళలన్
రమ్మని యెంత బిల్చినను రా రొకపట్టున లౌక్యభూసురుల్
పొమ్మని యెంత గెంటినను పో రొకపట్టున వైదికోత్తముల్.

చ. మసలుచుఁగర్మకాండమును మాయముఁ జేసిన రీతి జూచియున్
బస లలిత ప్రవర్తనము బావినిఁ ద్రోచినభాతిఁ జూచియున్

వసుధ నియోగిసంధ్యయును వైదికు చేతివిడెంబటంచునున్
హసనముఁజేతు రెల్లపుడు హా పెఱవారలు కోడిగాలకున్.

చ. పొసఁగు సమస్తము న్గలముపోటున మేటినియోగి కెప్పుడున్
గొన కఖిలంబు వైదికునకున్ సమకూరును దర్భపోటునన్
వసుమతి నేలువారలకు వచ్చు సమస్తము నీటెపోటునన్
బస నని కొంద ఱిట్లు తెలుపం దొరకొందురు కోడిగాలకున్.

ఉ. ఈయిసుకోలుబళ్ళకడ నింగిలిపీసులు పీసుపాసుగాఁ
గూయఁగఁజొచ్చి యామయిలగుడ్డలు వంకెదగిల్చిరండు మొ
ఱ్ఱో యన నాలకింప రిసిరో! కలికాలము గాలె రామ రా
మాయను వృద్ధురాలయిన స్మార్త వితంతువు మాటిమాటికిన్.

ఉ. కమ్మని కందిపప్పు నురు గారఁగఁ గాచిన నేతిబొట్టు దూ
రమ్మున దావిగ్రమ్ముకొనిరాఁ బొగు పెత్తిన యాకుఁగూరలుం
గుమ్మడిపొట్ల కాఁకరమునుంగయు వంగయు దొండ బెండశా
కమ్ములు దప్పళంబులను గల్పి భుజింతురు శాలితండులా
న్నమ్ములు భ్రేవుమంచనుదినం బరటాకులలోన బ్రాహ్మణుల్.

శా. అచ్చమ్మా యిది యేమిటే; రెయిలటే ఆసీ యిదేనా; సరే
బుచ్చమ్మాఁ వినలేదటే గడియలోఁ బోవచ్చునే కాశికిన్;
అచ్చో దేహము గ్రుద్దుకోదటే ఆయో ఆసౌఖ్య మేమందునే
యిచ్ఛారాజ్య మటంట్రు ట్రైనుగనియెంతే వింత విప్రాంగనల్.

ఉ. అంతయు నొక్కటే సకల మాత్మయె నీ దిది నా దిదంచుఁ గా
సంతయు నెన్న రాదు తన యాలయ, దార, ధనాదులన్నియున్
భ్రాంతులటంచుఁ బ్రత్యహము పల్మఱుఁదప్పకచెప్పి శుష్క వే
దాంతులు కొంప దోఁతురు కడాపటఁ జోగినిఁ జేతు రజ్ఞులన్.

చ. వలదని నేను చెప్పి గెలువంగలనా? యిఁకఁజాలుఁజాలు నేఁ
దెలియక యొక్కటన్న నలుదిక్కు లనన్ బదియంద్రుకానిలే
తెలిపెదఁ దెంపునం దెలుఁగుదేశపుస్మార్తుల వియ్యపొత్తులన్
దలచిన ధర్మశాస్త్ర, పరతంత్రులు గారనవచ్చు వారలన్.

చ. చెలఁగి నియోగిశాఖలను జేతురు వియ్యము భేద మెంచ రు
జ్వలమతులై నకొంద ఱిఁక శాఖలు మూడును నాఁడునాఁటికిన్
గలయుచువచ్చుచున్నయవి గాని యదేమొకొ తక్కు భేదముల్
దళముగఁ బట్టుకొన్నయవి దైవవశమ్మున నాంధ్రమండలిన్.

మ. వెలినాఁడున్ దెలగాణెమున్ మురికినా ద్విఖ్యాతము న్వేఁగినా
డు లలిం గౌసలనాఁడు నానయిదునాఁడుల్ ఋగ్యజుస్సామవి
ఖ్యలశాఖాత్రయివారు ద్రావిడులు సత్యాషాఢు లార్వేలవా
రలు బల్ నందవరీకులున్ దమిళవారల్ పాకనాఁటీలు; స్మా
ర్తులలో విస్తరిపొ త్తె వియ్యముల పొత్తుల్లేవు వింతయ్యెడిన్.

మాధ్వులు

సీ. "జావు లా" వని తురుష్కవ్యాహృతులు సెప్ప
"సాకు ఖే" కని స్వభాషలు వచింప
పంతులవారి ప్రభావంబు వెలయింప
నాచార్యభావంబు నధికరింప
ఓర్పుతో రాజకీయోద్యోగములు సేయ
ఘనభక్తి దేవతార్చనలు నెఱప
భోగినీయోగ సంభోగంబు చాటింప
దివిరి సాలగ్రామతీర్థ మాడ.

గీ. చాల మీగాళ్ళఁ దూల నీమాలఁ దొడుగ
తప్పకను మేనఁ బంచ ముద్రలు వహింప

లౌక్యవై దికములు చెవుల్ పట్టిలాగ
మాధ్వు లొప్పుదు రీయాంధ్రమండలమున.

సీ. గట్టిగా నొకపట్టు పట్టించె నేని ము
స్పత్తుహోళిగ తృణప్రాయ మనును
స్వస్తుతి న్నమ్మదేవర దొడ్డదేవర
తెలియ ముఖ్యప్రాణ దేవర యను
పరనింద నిమ్మదేవర యేను దేవర
రుబ్బుగుండాకార రూఢి గనును
తత్త్వబోధలు సేయుతతిని జీవపదార్థ
బేరె యీశ్వరవస్తు భేద యనును.

గీ. ఘనతరాంగారపుండ్ర శృంగారకలిత
ముఖమె సుఖమను మై గంధ లిఖిత ముద్ర
భద్రవితరణ కరణ నిర్నిద్ర యనును
మాధ్వుఁ డనిశంబు నీయాంధ్రమండలమున.

ఉ. బేరము లేని బేరి, శరవేగముఁ బెట్టని నారి, దంధణల్
బాఱని భేరి, ధర్మపరిపాలన లేని కచేరి, స్వచ్ఛ మై
పాఱనివారి వంటకము బాగుగఁ జేయఁగ నేరనట్టి వ్యా
పారి, యవాహకం బగు సవారిన పోలుదు రాంధ్రభూస్థలిన్.

ఉ. బాగుగనున్న వానికడ బంధువులెల్ల రుఁ దారె చేరి యే
లాగుననేని వాని బదిలంబుగఁ దంటనపట్టివైతు రా
త్యాగియు నాయమున్ వ్యయము నారయ కూరకనోడుఁ దాను ఫే
ణాగళుపూరిగళ్ ప్రతిదినంబును దప్పరు మాధ్వు లోగిటన్.

సీ. మాతుగళి ల్లె నమ్మ గురురాయర మహా
మధ్వరాయ స్తోత్ర మాడు బేకు

మంత్రగళ్ హేళినామగళు స్మరిసి హను
        మద్దేవరార్చన మాడుబేకు
మహిమఁ దత్తై లోక్యమాత శ్రీతులసిక
        నోడి ప్రదక్షిణ మాడు బేకు
అతిభక్తి శ్రీ భాగవతకేళి నందకు
        మార నమస్కార మాడు బేకు.

గీ. మహితపుణ్యనదీతీర్థమాడు బేకు
మానితాంగారపుండ్రగళ్ మాడుబేకు
బేకు బేకు సదా బేకు బేకు బేకు
అనుచు మాధ్వులు భాషింతు రనుదినంబు.

ఉ. కన్నడబాస లోఁగిట, నిఁకం దెలుఁ గందఱతోడ, బైటిక
త్యున్నతమైన బెబ్బులి ప్రయోగము, లోపట మేఁకపోతు కొ
ల్వున్నయెడ న్నవాబు పనియూడిననాఁడు పకీరు, భూస్థలిన్
గన్న సనత్కుమారుఁడు పగల్, నిశిగాముఁడు మాధ్వ డెన్నగన్.

మ. విసరుం జేతిరుమాళ్ళతో నడుగులన్ విప్పారు నేమాలతోఁ
దసుకాడుం బయిజార్లతోఁ దలల సూదారంగు పాగాలతో
వెసఁ బట్టంచులు జాఱు పై వలువతో బేషక్ కలందాన్లతో
బస వార్ధక్యముఁ లోన దాఁచగలరా పంతుళ్ళవా రిద్దరన్.

శా. సారోదారులు సాహసోద్ధత సమాచారుల్ వినోదార్థవి
స్తారుల్ ధీరు లలుత్ర్పతాపశిఖిసంతప్తారు లత్యంతగం
భీరుల్ ఘూరులు దానసౌరులు బదర్ఫేణీ మిఠా లడ్డు కా
హారుల్ పంతులువారు పొల్తురు ధరన్ వ్యాపారులై పాఱులన్.

సీ. కడుఁ జెల్వమగు బెండకాయబొట్టు మొగాన
        దతగంధముద్రాంకితములు మేన

మడచి తీర్చిన జరీ మధిర యోణి బుజాన
వెలగల యుంగరా వ్రేళ్ళపైన
అపరంజివిడికడియము మణిబంధాన
పగడాలసరము చొప్పడు గళాన
పట్టంచు దట్టంపు బలుతీకు పుట్టాన
మేలుముత్యాలత మ్మెట్ల తోన.

గీ. దస్త్ర మపసవ్యమునఁ గలం దాను సవ్య
భాగమున నుంచి కలము చేపట్టి గోవ
కాగితంబులపొతక మ్రోల నునిచి
ఫరుదు బరపర వ్రాయు వేపారిఁ గంటె.

ఉ. సమ్మతి నమ్మకర్మ సహజంబగుకర్మ యటంచ్రు నిమ్మక
ర్మ మ్మది దుష్టకర్మ యని పల్కుచునుందురు నోటి కేదియ
డ్డమ్ము జగమ్మునం భళభళాభళ మాధ్వులవంటివారు ని
క్కమ్ముగ లేరులేరని పుకారు పకారులు కారు కా రిలన్.

శా. ఔనోయీ నరసింగ రాయఁడ హుకుం అంపించినావా, మదార్
ఖానున్ చిత్తము వానిఁ బంపిన పనుల్ కావచ్చు సందేహమా?
సానాబోగముదా? మహాప్రభుఖులాసా కేమి యేముండయో
తానాగన్నెఱ సేయు నున్నత పదోద్యన్మాధ్వుఁ డత్యుగ్రుఁడై.

శా. వీటీమోది విటీనటీకుచతటీ విన్య స్తపాటీరయు
క్యాటీమోదికటీపీటీ పటువచో జంఝూటధీరార్భటీ
ధాటీమోది ఘటీభటీకృతశఢా దత్తారవిస్ఫార్యయః
పేటీ మోది వినోది మాధ్వధరణీబృందారకుం దిద్దరన్.

ఉ. మాధ్వగురుండు వచ్చు నొకమాఱు పదేండ్లకు, వచ్చి వారిధ
ర్మాధ్వ మదే యటంచు వరహావరహా యొక యగ్నిముద్రకున్

సాధ్వసలీల నిచ్చినను సాకన డింకను బేకు బేకు బే
కుధ్వని సేయు, మోక్షమునకుం గరణంబు హిరణ్యమే సుమీ.

చ. విరివిగ నేయి నూనియల వేపుడుకూరలు మెండుమెంతి చ
ల్లొరుగులు నూరుబిండులు ననూనము లప్పడము ల్వడెంబులం
బొరిఁబొరి నొందునుం దిరుగఁబోఁతలనింగువలెస్సమంచిపాల్
పెరుగులు వెన్న మీఁగడలు పెంపుభళాభళి మాధ్వులోఁ గిటన్.

సీ. ఒఱపైన వలిపెంపు చెఱఁగుగోచీకట్టు
తాటిముచ్చికవంటి తాలిబొట్టు
చేతుల నపరంజి చిన్నారిపోచీలు
మేలైన మెడఁ బిరి కీలసజ్జు
కడుఁతీవి నడుమున గంటల మొలనూలు
నెఱగుల్కుదమ్మెలఁ గరణిపూలు
పదయుగంబున వెండి పాంజేబు లందెలు
బటువుగుబ్బలబిగి పైఠిణీయు.

గీ. గలిగి బంగారు కీల్బొమ్మ వలెనే హంస
గమనమున మెల్లగఁ బడక గదికిఁ జేరి
యలరి పతితోడఁ జెండ్లాట లాడి యిష్ట
భోగములఁ దేల్చు వ్యాపారిపూవుఁబోఁడి.

మ. అనువారం బొకనోము స్నానములు మెండాచారము ల్చెప్పఁజా
లనువస్త్రంబులయందు దేహములజాలం బారిశుద్ధ్యంబు మా
టను మాధుర్యము ధైర్యముం దెలివితేటల్ చాల నొఁగాని యే
పనియున్ గట్టిగఁజేయనోరువరు వ్యాపార్యంగనారత్నముల్.

సీ. బెళగావ్ తలే హేద్దు బేగవుదంతథా
వన మాడి స్నానవు మాడికొండు

మడిగట్టుకొండు నే మకకూడి దేవతా
ర్చనమాడికొండు బెచ్చగెపదార్థ
ఈశగెభోజన యిట్టికొండుం దాను
మధుర భోజన బేగ మాడికొండు
తెలెబాచియనొడివి గళుహాకికొండు ని
ష్ఠగెపురాణపు కేళి సఖగళువరు.

గీ. కూడి హువ్వి వనకె హోగి కొయ్దు హువ్వి
గళుసరపుమాడియన్ రాత్రి కాలపతిగె
భూరిసంతోషదిందతాన్ భోగిసురుళు
కృతసుకృతపాణి వ్యాపారికీరవాణి.

ఉ. కన్నులు ద్రిప్పు సోలు గటకాముఖహస్తముఁ బట్టు జాఱుగా
వెన్నున నున్న పైఁట నొక వింతగ నంతట సర్ద నిండుగాఁ
బన్నుక వెంకుబాయ్ తులసిబాయ్ మొదలైన సఖీజనంబుతో
గన్నడబాస మాధ్వసతి కందువలాడు విధంబు గంటిరే.

మ. తెమలున్ బుణ్యవతీవిలాసము లధోదేహంబునం, దూర్ధ్వదే
హమునన్ బోడితనంబు, నోటనునృసింహస్తోత్రముల్ కన్నులం
భ్రమదావ ర్తనముల్, మెడందులసికామాలల్, కయిన్ బుష్పహా
రములున్, మాధ్వవితంతుయౌగపదసారాసారశోభల్తగున్.

మ. నిజమో కల్లయొ నే నెరుంగనునరుల్ నిందింత్రునిచ్చల్ నియో
గిజన శ్రేణినిఁ గుక్క గుంపనుచు, నగ్గిం ద్రెప్ప మాధ్వద్విజ
ప్రజలన్ గాకు లటంచు, వైదికులరాబందుల్ గదాయంచు, బే
రజమాడం దొరకొంద్రు దీని కొక మేరం గారణం బుండెడిన్.

వైష్ణవులు

సీ. గండ భేరుండంచు గల ధోవతికట్టు
కొమరైన పట్టెనామముల బొట్టు
కడుఁపెద్దముడికిఁ జొప్పడెడి సందెఁడు జుట్టు
నితరుల కెఱుకగా నీనిగుట్టు
సామాన్యులకును దుస్సాధ్యంబయినబెట్టు
ద్రవిడభాషా ప్రబంధములఱట్టు
కట్టితోఁ దోలినఁ గాని పాఱనితట్టు
తట్టంపు తెఱచాటు తళియపట్టు.

గీ. అట్టులిట్టుల ననరాని యట్టియట్టు
లెట్టు లే దమ్మి పేశీలో నెట్టునెట్టు
గట్టిగాఁ దెల్గు దేశంబు బట్టినట్టి
వీరవైష్ణవులను దొట్టు వారుమట్టు.

ఉ. ఆసరసోక్తి, యామృదుత, యాగురు భావము, నాప్రసన్నతా
భ్యాసము, నాముఖోద్యత విభాసము, నచ్యుతదాసదాసవ
దాసవరేణ్యదాసభటదాస తదీయకథానదాసవి
న్యాసనితాంతనై చ్యనటనాభినయంబును, వైష్ణవార్థముల్.

చ. తళతళ నెఱ్ఱఁబాఱు నిరతంబును దోమిన తామ్రపాత్రముల్
మిలమిల నున్నగా నలికి మె త్తిన యత్తిరుమాళిగల్, కడున్
బెళ బెళనాఱ దండెముల వ్రేలగవైచిన ధౌతవస్త్రముల్
భళిభళి వైష్ణవోత్తములపాలిటి భాగ్యము లేమి చెప్పుదున్.

సీ. చీటికిమాటికి శ్రీమతే రామాను
జాయ నమో యంచుఁ జదువుసొగసు

నిరుపమభక్తి చేఁ బెరుమాళ్ళను ఫిరాట్టు
దిరువడిఘళ్ గొల్చి యెఱుఁగుసొగసు
సారెసారెకుఁ దిరువారాధనంబులఁ
దిరువాయిమొడిఁ నోటఁ దెలుపుసొగసు
జ్ఞానులఁ గని యడియే నడియేను దా
సోహ మ్మనుచుఁ బల్కుఁ నట్టిసొగసు.

గీ. పరఁగఁ బన్నిద్దరాళ్వార్లఁ బరమభక్తి
మించి తిరుమంత్ర మొనర సాయించుసొగసుఁ
బొగడుచో వేయినోళ్ళకు మిగులు గొంత
వైష్ణవబ్రాహ్మణులదె దైవప్రపత్తి.

సీ. తిరుమణి తిరుచూర్ణ తిరుణాళ్ళు తిరుమంత్ర
తిరుమాళిగయుఁ దిరుక్కరియమధులు
తిరువీధి తిరుగలు తిరునామములు తిరు
వారాధనము తిరువాయి మొడియు
తిరువధ్యయనమును తిరుమంగ యాళ్వారు
తిరువేళికయు మఱి తిరువడిఘళు
తిరుపతి తిరుమల తిరువీనములు తిరు –
ప్పుణ్నేరములు తిరుప్పావు మఱియు.

గీ. తిరువలిక్కేణి తిరువటూ ర్తిరువనంద
పురమును దిరువళ్ళూరును తిరుతుళసియు
తిరు తిరు తిరుత్తిరు తిరుతిరుతిరు
దిరుగు వైష్ణవ పరిభాష తెఱవు మఱుఁగు.

ఉ. ధారుణిమీఁదఁ గాళ్ళెరయఁ దట్టుపయిన్ దగఁ గూరుచుండి వి
స్తారపుమోపుగట్టి మడిసంచులు ముందిడి, వెన్క దిండి సం

బారపుమూట పెట్టి యెడఁ బాయనిదాసుఁడు దోల శిష్యసం
చారముకై ప్రయాణమగు స్వామిని త్రోవనె చూడగావలెన్.

సీ. భుంభుంభురూం భురూం భుంభు మ్మటంచును
బూరగొమ్ములవారు ముందు నడువ
ఢండండడండడం ఢంఢ మ్మటంచును
ఢంకాలవా రొకవంక నడువ
ఖణ్ఖిల్ఖిణీల్ఖిణీల్ ఖిణ్ఖిలటంచును
గిలకకట్టలవారు కెలన నడువ
గుళుగుళుగ్గుళుగుళు గ్గుళుగు ళ్ళటంచును
గురుసం స్తుతులవార లొరసి నడువ.

గీ. రంజితములైన ముత్యాల పింజరీల
పైడియడ్డల బంగారు పల్లకీల
చెలఁగి తిరువీధి వేంచేపుఁ జేసికొనుచు
వచ్చు జియ్యలవారు శ్రీవైష్ణవులను.

సీ. పల్లకీపై నెక్కి బహుజనంబులు గొల్వ
బూర లూదుచువచ్చువార లొకరు
బడుగు గుఱ్ఱంబులపై నెక్కి కావటి
వానిఁ బెట్టుక వచ్చువార లొకరు
సాలుఁ జుట్టుక కుండలాలు వ్రేలఁగఁ బాద
చారులై చనుదెంచువార లొకరు
తలలు మాపుక ఛత్రధారులై యక్షయ
పాత్రఁ బుచ్చుకవచ్చు వార లొకరు.

గీ. అవని శ్రీరంగమున వేంకటాచలమున
యాత్ర లొనరించువారల నాశ్రయించి

తీరి కూర్చుండి గడియించు వార లొకరు
బహువిధంబులు వైష్ణవ వర్తనములు.

ఉ. దోసమువచ్చునంచు మదిఁ దోఁచెడినందున కేమి సేయుదున్
జేసినపాప మెప్పుడునుఁ జెప్పినఁ బోవును వైష్ణవుం డుప
న్యాసము జేసెనా? విడువ కాఱునెలల్ వినువారిమంగళా
శాసనశక్తి యెట్టిదొకొ? చప్పునఁ దీరును లౌకికార్థముల్.

చ. వినుమని చెప్పఁ బూనితిని వింతకు, నన్నెవరై నఁజెప్పవో
యని పలికించిరా! యనృతమాడఁగఁగారణమేమి? మాట దాఁ
చను జలికోఁతమందుసుమి సంసరణ వ్రణపూర్ణ శాంతికిన్
ఘనుడగువైష్ణవోత్తముముఖమ్మునఁ బొందుమహోపదేశముల్.

చ. చెవిఁ బడరాదు సాంబ శశిశేఖర శూలధరాది నామముల్
సవనము లెందుఁగాన మిఁక స్నానము లాగళముల్ ప్రచారమా
వివిధము సంధ్య సంగ్రహము వెల్లువ లద్భుత కై తవాత్మసం
స్తవములు వైష్ణవో త్తములతత్త్వములం గొనియాడశక్యమే.

ఉ. కోపము వచ్చునేమొ మదిఁ గొంచెము నాకు భయంబుదోచెడిన్
దాపములెల్ల ఁదీర్చుటకు ఁదాపమె హేతువటంద్రు మంచిదే
పాపము వైష్ణవోత్తములు పల్కినదే నిజ మెట్టులంటిరా
వ్యాపకమైన వజ్రమును వజ్రమె వ్రయ్యలు నేయఁజాలెడిన్.

శా. ప్రీతిన్ శిష్యునకున్ సమాశ్రయణ మర్థి న్జేయుచో బాహు
భీతిన్గంపిలఁజేసినన్ విడువరుర్విన్ వైష్ణవుల్నిర్దయుల్ వుల్
"తాతాచార్యులవారి ముద్ర బుజముల్ తప్పించుకోఁగోరి కా
లూఁతంబాఱిన వీఁపుదప్ప" దనుఁబూర్వోక్తి ప్రకారంబునన్.

ఉ. రచ్చలలోన నన్నుఁ బలు రవ్వల బెట్టిన నేమి వారికిన్
నచ్చిననేమి, కాక మఱి నచ్చక యుండిన నేమి చెప్పెదన్

పిచ్చియొ? వెఱ్ఱియో? నిజము, బేర్మిని వైష్ణవుఁ డెంతకాంచనం
బిచ్చిన నంత మోక్ష మను నీయక యుండిన ముక్తి లేదనున్.

చ. తిరుమణి విష్ణుఁడుండు సిరి దేటపడన్ దిరుచూర్ణమందు సు
స్థిరముగ నుండు వైష్ణవుని దివ్యముఖంబున నిద్దఱున్ సదా
తరలక యుండ్రిఁకన్ దులసిఁ దామరనట్ల నెయుండ్రటంచుఁబ
ల్కిరి హరు లెందఱో సిరు లికెందఱో తద్దరు లెందతో ధరన్.

ఉ. గారవ మొప్ప శిష్యులకుఁ గమ్మని తియ్యని మంచిమంచి ప
ణ్నేరము లారగింపుడని నెయ్యమునం దయచేసి కొంచుసాల్
వారిబదేంటి దీకొఱంత లాగరు, లాగుటఁ జెప్పునప్పుడా
చారులవారిఁ జెప్పవలె స్మార్తులఁ గీర్తుల నట్టుఁ బెట్టుఁడీ.

సీ. చల్దినై వేద్యముల్ చాటుననేగాని
    గ్రామదేవతఁ గొల్వ రాదటండ్రు
వఱుగుపచ్చడి దింట మఱుఁగుమాటేకాని
    గోంగూర దటికిరాఁగూడ దండ్రు
పులిహోరసాద మాకలిదీఱుటకేగాని
    యేకాదశినిఁ దిండి హేయమండ్రు
ఆత్మసంస్తుతు లవి యాచార మేకాని
    దురభిమానము చాల దూష్యమండ్రు.

గీ. ఘనపటాటోప మెల్ల లౌక్యంబెగాని
దంభసంరంభములు సేయఁ దగదటండ్రు
చెట్టలకుఁ గొంత యుపపత్తిఁ జెప్పుచుండ్రు
వైష్ణవాచార్యస్వామ్యయ్యవార్లు గారు.

ఉ. చుంగులువార ధోవతులు సొంపుగఁగట్టిన యుత్తరీయముల్
కంగులుదీర నంసములు గ్రమ్ముకవ్రేలఁగఁ జల్దిసాదముల్

రంగునఁగొట్టి కోవెలకొ రాయులఁ గొందఱుమందివైష్ణవుల్
పొంగళిబుట్ట లెత్తికొని పోవుదు రిండ్లకు వీధి వెంబడిన్.

చ. తెలియదు నాకుఁ బూర్ణముగ ధీరులు వైష్ణవు లేమి సేతురో
చలనము గానరాదు, తెఱచాటునఁ జేతు; రదేమిటంటిమా
తళియ యటంద్రు; కొంచెము నిదానముగా నొకయింతవింటిమా
గళుకుగళుక్కుమన్గటుకు గట్కుగుటుక్కు గుటుక్కుగుట్కుమన్.

శా. బారుంబూరుగ నారగింతురు వడప్పణ్ణేరముల్ పూర్ణ ప
ణ్ణేరంబు ల్పులిహోర తైరువడ పణ్ణేరంబు దధ్యోదనం
బారంగర్యమధుల్కొళంబు పురితో హ్యాతైరుమోరున్మహో
దారస్వైరవిహార వైభవు లుదాత్త ప్రాభవుల్ వైష్ణవుల్.

ఉ. కాఁకరకాయ కట్టొకటి కై నిడిపోయెడికాపు జూచి "చీ
యేకడఁగజ్జికాయ లివి యేటికనన్ విని "మంచికూరయౌఁ
గాఁకరకాయలం" డనుచుఁ గాపు వచింపఁగ "నట్ల నా, యవుం
గాకిటుఁ జూపు" మన్న విని కాపు సమర్పణ సేయఁగా దిరు
ప్పాకముఁ జేసి సాపడిరి వైష్ణవు లొక్కరు తొల్లి మెల్లనన్.

ఉ. వైష్ణవునామముల్ గనిన బా బొకఁ డోర్వక నాక వాని క్రో
ధోష్ణము నార్ప నాతఁడొక యుక్తిని బన్నెఁదురుష్క భూమిరా
డ్జిష్ణుతకంచు నాభిపరిషి క్తము దిద్దుట గాన కాతఁ డా
యుష్ణకరాత్మజాలయము నొయ్యనఁబోయె నటంద్రుగ్రక్కునన్.

చ. చెఱువున కేగెడున్ జలము చెంబును బూనఁడు, లేశమాత్రము
న్మఱుఁగు జరూరు లేదు, తను మానవు లెవ్వరు చూచినన్ సరే
వెఱువఁడు, బాహ్యగామి యగు వేళను, సాపడునప్పు డొప్పుగ
న్దెఱమఱుఁగడ్డముంచకను తీరదు వైష్ణవభూసురాళికిన్.

చ. దిటముగ లోనగోచియిడి తెల్లనిధోవతి గూడకట్టుగాఁ
బటుగతిఁగట్టి జుట్టుముడి, బల్వొయలై వెనుపట్టెమూయఁగా
స్ఫుటముగ నూర్ధ్వపుండ్రములు శోభిల దవ్వుల నవ్వుకొంచుని
వ్వటముగఁ గన్నులార్చుచును వైష్ణవమాణవకుండువచ్చెడిన్.

ఉ. పూచినతంగెడుల్ కరిగి పోసిన బొమ్మలు నిల్చి ధాత్రిపైఁ
దోచిన క్రొమ్మెఱుంగు లమితోజ్జ్వలరాజకిరీటకోటిపైఁ
దాచిన పద్మరాగములు దర్ప కుదార లసత్ఫటంబు పై
వై చినచిత్ర రేఖ లల వైష్ణవసుందరు లేమి చెప్పుదున్.

తరువోజ. తిన్ననిసన్నని తిరుచూర్ణ రేఖ
తీరుగా సౌరుగా దిద్దిన మోము
మిన్నఁగా నున్నఁగా మెఱుఁగార దువ్వి
మేలుగా వీలుగా మెలచినకొప్పు
చిన్నారి పొన్నారి చెమరెత్తుచున్న
సిరుగుల్కు నెఱిఁదళ్కు చెక్కుటద్దములు
వన్నెతో చిన్నెతో వరుని మెప్పించు
వాసిగా దాసిగా వైష్ణవయువతి.

ఉ. సారణిమీటుఁ గిన్నెరల సాటిగ సన్నని గొంతు లెత్తి శృం
గారముమీఱ రాగములు గాసరిగాఁబెరుమాళ్ళసన్నిధిన్
హారతు లిచ్చువేళల యొయారము వైష్ణవపమ్మవారలం
గారలదేసుమీ మధుర గానము తమ్మిళిపేశి దోడ్పడన్.

చ. కలదుసుమీ యొకింతయుపకార మనాథలపట్ల మేటితెం
గళి కుడివడ్డలం దదియుఁ గానము స్మార్తులతోటిపాటె యెం
దులకిటులంటి రంచు మదిఁ దోఁచెడి మీకును శంక దీర్చెదన్
నెలనెలకున్ వితంతువుల నెత్తులు మంగలి ముట్టకుండుటన్.

చ. “ఎడపక సానియి ల్మఱిగి యిల్లనఁ డద్దిర” యంచుఁ దం(డియ
ప్పుడఁతుకయింటఁ గన్మొరణ బాలకుఁ జూడఁ బిపాస దానిపా
వడ బయికెత్తి లోనిమిడి పాలునుగూడునుసాపడంగ “నా
బుడుతఁడు వైష్ణవంబు నిలుపున్సరిగా” నని మెచ్చి వానికై
వడుల గణింప కేగెనఁట వైష్ణవుఁ డొక్కఁడు తొల్లివింటిరే.

శైవులు

సీ. భస్మత్రిపుం(డముల్ ఫాలదేశంబున
నడునెత్తిమెడమీఁదఁ గడతలందు
కనుఁగ్రేవలను వీఁపునను బుజంబులయందు
మ్రోచేతులందు ఱొమ్మునను బొజ్జ
మణిబంధములఁ గటి మండలంబున వ్రేళ్ళఁ
బ్రక్కల మోకాళ్ళఁ బిక్కలందు
సీలమండలనుఁ బాదాలపై నడుగుల
వ్రేళ్ళ మొదళ్ళను గోళ్ళయందు.

గీ. నిచ్చటచ్చటననరాక నెల్లయెడలఁ
దనువు నిండఁగఁ దెగఁబూసి తమ్ముఁజూచి
యదరిపడి బ్రహ్మరాక్షసుల్ బెదఱిపాఱ
శైవభూసురు లాంధ్రదేశమునఁ గలరు.

సీ. తలయు గడ్డము మీసములు గోళ్ళుఁ జంకలు
దండిగాఁబెంచి గొందఱు చరింత్రు
మణిగెఁడు రుద్రాక్షమాలికల్ మెడయందుఁ
దలయందుఁ దాల్చి కొందఱు చరింత్రు
పులి వెంబడించినప్పుడు గూడ భవినీడ
దరియ రా దనుచుఁ గొందఱు చరింత్రు

ఎట్టియాపదనైన నఁ బట్టినట్టి వ్రతంబుఁ
దప్పరా దనుచుఁ గొందఱు చరింత్రు.

గీ. బ్రాహ్మణులతోడి పొత్తును భక్తి మీఁది
వలపు నీ రెండు నెన్నఁడు దలఁపునందు
మఱవఁగా రాదటంచుఁ గొందఱు చరింత్రు
శైవభూసురు లాంధ్రదేశంబునందు.

సీ. పంచాక్షరీమంత్ర పఠనగోప్యమె కాని
యధ్యయనంబు లంతంతమాత్ర
మాగ మోక్తంబుల నాచరించుటె కాని
వేదో క్త మదియొక్క వీసముండు
నట్టిల్లు నిండఁగాఁ బట్టు పెట్టుటెకాని
కర్మధర్మము లెవ్వి కానరావు
తుదకు నూఱైన వత్తులు గాల్చు టేకాని
టోపాసనములు మాటాడరాదు.

గీ. ధనము వెచ్చించి రాత్రి భోజనము లిడుచు
జనులు గొనియాడఁగా గణార్చనలెకాని
యజ్ఞ యాగాదికముల పే రైన వినరు
శైవు లేమందు నాంధ్రదేశంబునందు.

చ. పరశివునం దమందదృఢభక్తి, యనారత నిందితక్రియా తా
చరణమున న్విరక్తి, మధుసారము లొల్కుమృదూక్తి దేవ
ధ్వరకరణాగమప్రచురతంత్రవిశంకటశక్తి, తుందగ
హ్వరపరిపూర్ణ భుక్తి, యహహా యివి శైవుల నైజ సంపదల్.

చ. మనుదినమున్ ప్రసాదనియమంబును నిత్యమహేశ్వరార్చనం
బును నిరతంబు బిల్వదళపూజ సదాధృతభవ్యలింగలాం

ఛనమును సర్వదా పటుపిశాచవితానవిపాటనక్రియా
చణమగు భూతిధారణము శైవులు మాన్యులుగారె ధారుణిన్.

ఉ. కట్టలుకట్టలే కరుచు గావలెఁ బత్తిరి, ప్రుగ్గుపిండులా
బుట్టలె బుట్టలే తఱిగి పోవలె, మెత్తనిదూదివత్తులా
తుట్టెలుతుట్టెలే చమురుతో వెలుఁగన్వలె, నౌప్రసాదమా
తట్టలు తట్టలే కొసలు దట్టగ విస్తరి నిండఁగావలెన్
పట్టులుపట్టులౌర యయవారలకు న్శివపూజవేళలన్.

సీ. నూఱువత్తులవారు పేరు చెందనివారు
వేయివత్తులవారు విడియుచోట
వేయివత్తులవారు వెనుకఁబట్టినవారు
లక్షవత్తులవారు డాయుచోట
లక్షవత్తులవారు లావుదూలినవారు
కోటివత్తులవారు గూడుచోట
కోటివత్తులవారు కొఱకుమాలినవారు
భూరివత్తులవారు చేరుచోట.

గీ. విత్తమునకే ముదాత్తవిద్వత్త కేమి
చిత్తసత్తల కేమి ధీమత్త కేమి
వత్తులే బత్తులకును మహత్తు లెన్న
దేవసములైన శైవభూదేవులందు.

ఉ. కాయము భూతిభూషితము కర్మము తీక్ష్ణము దుర్గమంబు న
త్యాయతి నంతరంగగుణ మద్భుతమైన శిలన్ గరుంగఁగాఁ
జేయుజగత్తమంబు పసఁజించు మహామహిమంబు భానులె
క్కాయను గంటిరే నివురు గప్పిననిప్పులు శైవభూసురుల్.

మ. తమకున్ వృద్ధవితంతుమండలము వేదాంతార్థసారోపదే
శములన్ శిష్యగణంబులై కొలువఁగా, సత్తంచుఁజిత్తంచు భూ
తములంచున్మతియింద్రియమ్ములనుచున్ దత్తంచుఁద్వమ్మంచసి
క్రమమంచుం బరమాత్మయంచు గురురాట్కారుణ్యమంచుందవై
వమమంచుం బహుధా వచింతురువహవ్వా? వృద్ధశై వాగ్రణుల్.

ఉ. తత్త్వవిదుల్ శివద్విజులు దారు వచింతురు వారి కెప్ట ప్రే
తత్త్వము లేదుగాన తనుదాహము గూడదటంచు; బాగుదే
వత్వమునందు వారలకు వచ్చునధోగతు లాసమాధివా
సత్వమునన్ గతం బెఱుఁగఁ జాలవిరుద్ధముగాఁ గనంబడున్.

ఉ. తల్లికి భారమా? శిశువు, తామరతూటికి పువ్వు భారమా?
విల్లొకభారమా? కడిఁదివీరున. కొంటెకు గూను భారమా?
వల్లికి భారమా? ఫలము, బ్రఱెకుఁ గొమ్ములు భారమా, నుతుల్
చెల్లును లింగధారులకు లింగఁపుగాయలు భారమా? మహిన్.

శా. భూతప్రేత పిశాచ రాక్షసగణంబుల్ శాకినీ ఢాకినీ [హ యం
వ్రాతంబు ల్భయకంపమంది తొలఁగన్ హాంహ్రీంపటోస్వా
చాతంకంబులుమానిమంత్రమహిమవ్యాప్తిన్ గ్రహగ్రస్తులం
బ్రీతిన్ దండనలాడఁజేతురు గ్రహావేశంబులన్ శాంకరుల్.

ఉ. లింగము వోయినంబ్రతుకు లేదని శైవులు లింగరక్షణన్
భంగము లేక సేయుదురు; ప్రాగ్భవసంచితపాపశక్తిమై
లింగముపోయినం దెలియ లే రది మానవులంచుఁ గొందఱా
లింగముపోయినం బదులు లింగము దాల్తురు భక్తి మీఱుఁగన్.

ఉ. మర్త్యత లింగధారణము మాత్రనపోపు నమర్త్యభావమే
కీర్త్యము శైవవిప్రతతికిన్, బ్రతు కందఱతోడిపాటె, యా

మర్త్యత కేమియర్థమొయమర్త్యతకేమొయెఱుంగమాదటన్
మర్త్యత మంటపాలగు నమర్త్యతగంటిరె మంటిపాలగున్.

చ. వడివడిగా హరీ యనిన వారక మూతురు గర్ణరంధ్రముల్
తొడరి హరా యటన్నఁదమితోఁదమమేనులు దామెఱుంగ రా
గుడితలకట్టు భేదమునకున్ రసభేదము నొందునట్టి దె
క్కడిపని శైవభూసుర శిఖామణులందునఁదక్క లాఁతులన్.

ఉ. కొందఱి భూతకోటిఁబురి కొల్పుదునం చదలించి లోఁగొనుం
గొందఱియింట నౌకరయి కొల్చి మతు ల్కరఁగించి యిష్టుఁడౌ
నందిన జుట్టుఁ బట్టుకొను నందక యుండినఁ గాళ్ళుపట్టు న
స్పందవిచారశీలుఁడగు శై వమహీసుర శేఖరుం డిలన్.

చ. అడవి నెడారిదారిఁ జనునప్పుడు శై వమహానుభావుఁ జో
రుఁడొకఁడు వెంబడించినఁబరుంగిడఁ గాలికొలందిఁ జొచ్చియా
మిడిమిడి దొంగపోటులకు మిక్కిలియయ్యెను లింగపోటటం
చడుగిడనేఱ కీశ్వరహరాశివశంకరయంచుఁ గూయిడెన్.

శా. అయ్యా శైవులఁ బిల్చుచో జనులు పేరయ్యయ్యవారంద్రు పే
రయ్యంద్రొక్కరు పేరయంద్రొరులు పేరారాధ్యుఁడంద్రొక్క రా
యయ్యన్ బేరయ లింగమం ద్రొకళు లొయ్యం బేరలింగంబటం
ద్రయ్యైవేళల వారువారు సమయోక్తానేక నామంబులన్.

ఉ. చర్యలు నామము ల్దెలుపు శైవులు వైష్ణవు లంచు నెప్పుడున్
ధార్యము లింగ మొక్కరికిఁ దప్తము లన్యుల; కెన్నలింగయా
చార్యుడు రంగలింగమును శైవులు వైష్ణవులందు నామసాం
కర్యమునొందుఁ బూరుషులు గానఁగరారు మతంబుకట్టడిన్.

చ. మొగమున భూతి రేఖలవి మూడుఁగణంతల రెండు దీర్చివా
సిగఁబలుజం దెపోగులను జేర్చిన నున్నని లక్కలింగకా

యగనఁబడుంగనంబడ దొాయారముగం జరలింగ మందు రీ
జగమున లింగధారిమత శాబకుఁ డాడు నియోగిబాలుతోన్.

సీ. సూత్రంబునకు లింగసూత్రంబు సహకారి
పొసఁగుఁ గుంకుమకు విభూతి తోడు
కరకంకణముల సంగాతముల్ దోరముల్
ధూపగంధము గంధలేపసఖము
అవతంసభూషా సహాయంబు తొగ తేకు
రహిఁ బదంబులకుఁ బారాణి నే స్తి
కొనచెవి బొగడల కనుఁగు మారెడుపత్రి
గోళ్ళకుఁ గాదిలి గోరిఁటాకు.

గీ. భక్తి మహిమకు నఱచూపు ప్రాపుసుమ్ము
శాంతభావంబు మందహాసంబు ప్రియము
ఉక్తి మృదుతకు శివనామ ముపపదంబు
వాసిగను లింగధారమ్మవారలకును.

సీ. వేఁగుజాముున లేచి వీధిగుమ్మముఁ జిమ్మి
యిల్లూడ్చి యావెన్కఁ బళ్ళు దోమి
గోమయంబునుఁ దెచ్చి గీము నున్నఁగ నల్కి
కలయంపి వాకిళ్ళఁ గలయఁజల్లి
చిన్నె వన్నెల ముగ్గు చిగురుబారలఁ దీర్చి
మడిబట్ట లుతికి ప్రొయ్ పిడకల నిడి
రాఁజేసి మడిగట్టి రాజాన్నములు వండి
భక్తి మీఱఁగ బిండి పట్టుఁ బెట్టి.

గీ. వత్తిజోతులు మారేడు పత్తిరియును
తుమ్మిపూవులు చమురు కుందులు విభూతి

పండ్లు పతిశివపూజ కేర్పాటుఁ జేసి
వాసిగను లింగధారయ్య వారి నారి.

సీ. తుట్టెగట్టినపిండి తట్టలో దొాక యింత
ముగ్గుపట్టులఁ బెట్టు ముగుదయోర్తు
బూజుపట్టిన ప్రాఁత బూది గడ్డలు కొన్ని
లింగలేపము సేయు లేమయోర్తు
వఱుగుగా నెండి ప్రాఁ బడిన మారెడుపత్రి
శివపూజ కొనఁగూర్చు చేడెయోర్తు
ఏడాది కొక్క తూరే చేసి డాఁచిన
వత్తులు వెలిఁగించు వనితయోర్తు.

గీ. ఉడికియుడకని మెదుకు నీ ళ్లోడుపప్పు
కాఁగికాఁగనిచారును గరిటెనంటి
తొలఁగిజాఱని కట్టావి పులుసుఁగూర
పతికి వడ్డించు శై వరూపవతియోర్తు.

చ. వలపులు లెస్స, కూడని వివాదలు లేశము గానరావు, కా
వలసినయంత భక్తి గల వారయినన్ భయమే కొఱంత భ
ర్తలయెడ లింగధారివనితాతతి, కయ్యది వారిపుణ్యమో,
చెలువలదోషమో, తలఁప స్వీకృత లింగ శిలామహత్త్వమో,

శా. చారుంగూరలుపప్పులుంబులుసు పచ్చళ్ళప్పడాల్ దప్పళా
లూరుంగాయలు మెంతిమజ్జిగలు పాలుంబాయసాన్నంబులుం
గారెల్ బూరెలు బొబ్బటు ల్దినఁగ పక్కాబంట్లు శైవుల్ స్వచే
ష్టారూఢంబగు కాఁకకుం బసవగడ్డల్ దొడ్డమందుండఁగన్.

చ. కుడువఁడు భక్ష్యభోజ్యములు గోరసనీరముఖ ద్రవంబు లా
నడు మెడబంగరుంగొలుసునం దగిలించిన లింగకాయలో

విడిసినలింగమూర్తికి నివేదన సేయక శైవభూసురుం
డడవి నొకండు నెండను బ్రయాణము సేసెడివేళనేనియున్.

చ. పశువుమతంబు శైవమది, పాముమతం బది వైష్ణవంబు, క
ర్కశములు గావు మాధ్వ మది గట్టిగఁగోతిమతం; బదెట్లునాన్
బసవఁడు, భాష్యకారులును, మధ్వుఁడు; నందియు, శేషుఁ డంజనీ
శిశువును మానవత్వమును జెంది జనించినవారు కావునన్.

కరణ కమ్మలు

మ. మత మేదో తెలియంగరాదు కల దామాధ్వాళితోఁ బొత్తు, సం
తతమున్ లౌకికవృత్తిజీవనము, పెద్దల్ వామనాచార్యునం
చిత సిద్ధాంతము వారి దందురు; మఱాసిద్ధాంత మే చందమో,
మతి నూహింపఁగ లేరుపో, కరణకమ్మల్ తెల్గుదేశంబునన్.

సీ. నూఱూళ్ళ కొకయింటి వారైనఁ గనరారు
దొరకిరా యరుదుగాఁ బురములందు
నమరదు పడుచు పెండ్లాడఁదలంచిన
దొరకెనా యొక సంచి దులపవలయు
వెతకియైనను వారి మతముఁ జెప్పఁగలేము
దొరకెనా సిద్ధాంత మెఱుకపడదు
పరమవైదికమును బట్టిచూచిన లేదు
దొరకెనా ముదుసలి త్రొక్కులందు.

గీ. అన్నదమ్ములవారలు గన్న వారి
నడుమ వచ్చిన వెనుక నొక్కడనే యుంట
దొర కెనా యొక్కరిద్ద ఱుందురు జగాన
విలువగలవారు కరణకమ్మ లనువారు.

చ. నడవడులన్ని యోగిసరి, నామమునందును లౌక్యమాధ్వుకై
వడి, మడిమంత్రలందుందుల వైదికుతో, నింక వైష్ణవంబుచొ
ప్పడుసముదా త్తభాగవత భక్తిని, యుక్తి గొఱంతలేదు నల్
గడలం బొసంగెడిన్ గరణకమ్మకుం గుమ్మకులిమ్మతమ్ములన్.

సీ. గుణము మంచిది కాని గుట్టు కొంచెంబైన
కరణకమ్మలకు జగానం గాన
త్యాగభోగమెకాని ధనసంగ్రహము చాలం
గరణకమ్మలకు జగానం గాన
మాటబింకమెకాని మనసు నొప్పించుట
కరణకమ్మలకు జగానం గాన
పేరుదొడ్డదిగాని బెట్టు విస్తారంబు
కరణకమ్మలకు జగానం గాన.

గీ. లౌకికములైన వ్యవహార లాంఛనముల
వేషభాషల క్షాత్రంబు వెలయుంగాని
బ్రాహ్మణాచారహాని యే పట్టులందుం
గరణకమ్మలలోన జగానం గాన.

సీ. కొమరైన జలతారు కోకగట్టును గాని
గోచిగొప్పది పైంటకొంగు కురుచ
రాణించు మేల్పట్టు రవిక దొడగుంగాని
జేబు పెద్దది దండచేయి పొట్టి
ముంజేతికంకణంబులు పసందే కాని
కడ్డీలు లావు లో దొడ్డి బిగువు
నాణెంపుబంగారు నత్తుం బెట్టును గాని
గాటు పల్లము రాతికట్టు మెఱక.

గీ. స్మార్తులందు నియోగుల మాధ్వులందు
యాజ్ఞ వల్క్యులయందు లౌక్యప్రవరులఁ
గరణకమ్మల నీనాఁటికాలమందు
వఱలు వగలాఁడిపడుచు పువ్వారుఁబోఁడి.

యాజ్ఞవల్క్యులు

మ. కుడువంజొచ్చును బ్రాహ్మణార్థములఁ బెక్కు ల్రాజకీయార్థముల్
నడువంజొచ్చును యాజ్ఞవల్క్యుఁడు ధరన్నానోచ్చనీచంబులం
దెడ లేక న్నటియించుఁగాలము కొలం దింబోపు. నేయెండ కా
గొడుగుంబట్టు ధనార్జనంబునకు నె గ్గున్ మ్రొగ్గు తగ్గేమనున్.

గోలకొండ వ్యాపారులు

ఉ. పేరున రావుపంతు లని పెట్టకమానరు, వైష్ణవంబు వి
స్తారము, వైదికంబు గలదా? యని రోసినఁ, గొంత జిక్కు సం
సారముగుట్టువారలదె, 'సాధువు లెందును గోలకొండ వ్యా
పారులు లౌక్యవృత్తులన' పారులు, కారులు పల్క రెప్పుడున్.

సీ. శుచిదేఱినయొడళ్ళు సొగసైన కుచ్చెళ్ళు
చిట్టాడు మీగాళ్లు జుట్టుముళ్ళు
తమ్మెట్లరవఱాళ్ళు తమలంపుఁ బసనోళ్ళు
రంగురుమాళ్ళుంగరాల వ్రేళ్ళు
రావుపంతులు పేళ్ళు రవరవచప్పుళ్ళు
రాతిరియుఁ బగళ్ళు వ్రాయుగీళ్ళు
బంగారు మొలత్రాళ్ళు పై జారుజోళ్ళు వై
ష్ణవుచేతి నీళ్ళఱచాటుమళ్లు.

గీ. చక్రపొంగళ్ళు సాపాట్లు సగముపాళ్ళు
పెళ్ళినడవళ్ళు వేయాఱు పెట్టుబళ్ళు
నిత్యమును గామ్యములు సొమ్ము నిజము గోల
కొంద వ్యాపారులం దాంధ్రమండలమున.

సీ. ఎలమిఁ జీపురువట్టి యిల్లూడ్చునపుడైన
పోనీరు తలజుట్టు పూల మెఱుఁగు
అసదుగా జలకంబు లాడు వేళలనైన
పోనీరు నునుగొప్పు నూనె మెఱుఁగు
మడిగట్టి వంటకా ల్కడ తేర్చునపుడైన
పోనీరు తొడగుకడాని మెఱుఁగు
నాయకాలింగనోన్నతసౌఖ్యమందైన
పోనీరు కొంతైన మేని మెఱుఁగు.

గీ. తనులతా చారుతాశుచితావిభూష
ణాంచితాంగవిలాసతావాత్తి నతుల
మతుల సుకృతులఁ గృతచమత్కృతుల గోల
కొండవ్యాపారసతులఁ బేర్కొనఁగఁ జనదె.

ద్రావిడులు

ఉ. ద్రావిడ వైదికోత్తముల ధర్మములన్నియు దేశ్యతుల్యముల్
గా వొక కొన్ని భేదములు గానఁగవచ్చు శివాక్షమాలికల్
లావు, సదా వహింత్రు నవలాల్ కుడిపైఁటలు, కచ్చుకట్టులా
లేవు, వివాహశుల్కములు లెస్సలు, సాములు దేశయాత్రలం
ద్రోవిడుసొమ్ము లంగనల పూర్వభవార్జితపుణ్యలబ్ధముల్.

వివాహములు

ఉ. చెప్పకయున్న దోషమగుఁ జెప్పినగోపములేమి సేయుదున్
జెప్పకతప్ప దీ వయిపు సీమల బ్రాహ్మణకోటిఁ గన్యకల్
గొప్ప గిరాకి పెద్దపడి గుండున నల్వది సేర వెండికి౯
జప్పుడు లేక దూఁగు నది చాలక యున్న మఱొక్క సేరగున్.

ఉ. చెప్పిన కార్యమే మెవరు చేతురు నాపలు కాలకించి, వెం
కప్పకు డెబ్బ దేండ్లు నరసమ్మకు నెన్మిది యేడు లీడుగాఁ
జొప్పడెనంచు నాంధ్రపదసూరులుతప్పక పొంతనంబుల౯
జెప్పుదు రెంతతప్పపని ఛీ! ముసలిం బసికాయ మెచ్చునే?

ఉ. అప్పుడే పెండ్లివచ్చె మన యమ్మికినంచును దల్లి దండ్రియ
న్నప్పలుఁ జెప్పఁగా వినుచు నాయికఁ దోయిలమబ్బెఁజక్కిలాల్
పప్పులు పాయసా లరిసె పప్పులుకుప్పలు తెప్ప లప్పరో
యెప్పుడెచెప్పుచెప్పుమని యీడ్తురుపయ్యెదకొంగుఁబట్టికీల్
గొప్పునకొప్పులై కురులు గూడనియీడున నాంధ్ర బాలికల్.

ఉ. చేతురు కయ్యము ల్గడుసుచెయ్యుల వియ్యపురాండ్రు; చాలునీ
కూఁతురిసారెలో నిడిన కోక యిదోపది రెండుమూళ్ళు; నీ
కూతుఁరిసారె నేను గనుఁ గొంటినిగా పదిమూళ్లె లేదుగా
నీతులు లాఁతికిం దెలుప నేర్తువటంచును మూతిద్రిప్పుచున్.

అత్తకోడండ్రు

చ. తెలిపెడి నత్త, కోడలికి దివ్వెలదివ్వెల దివ్వెలంటుదు౯
దల; శనివారమాపయినిఁ దా బుధవారమునాఁడు నంటుదు౯
దలవినుఁడమ్మకూఁతులకు; తథ్యముచెప్పుఁడుతల్లులార! యం
చలవడినీళ్ళ రేవుకడ నమ్మలు నక్కలు గూడియుండఁగన్.

చ. అడిగినఁబొట్టనిండునటు లన్నము పెట్టని యత్తతోఁడఁ దా
వడివడి నంబ టేరదుగొ వచ్చెడి! నత్త, యనంగఁ గోడలా!
బుడబుడ లేల పొమ్ము కొలబుర్రను జూడుము నాదు చేతిలోఁ
దడఁబడదెప్పుడంచు నుడి దప్పక కోడలి కత్త సెప్పెడిఁ.

చ. అలుకున బిచ్చగానిఁగని యందదు పొమ్మని కోడలన్న, వాఁ
డలుఁగుచుఁ బోవఁద్రోవఁగని యత్తిటు రమ్మనిపిల్వ, వాఁడురా
నిలువక పొమ్ము లేదనిన నీ కిదియేమని వాఁడనఁ; సరే
కలదన లేదనఁ దనది కావలెఁ గోడలిప్రేష్యమేమనుఁ.

ఉ. "కోడల! వీఁపుదోము" మని కోరినయత్తనుజూచి "యత్త! చే
యాడదు, కాలు పై కెగయు" నన్న "నయో, మును నేను మీఁది
తోలూడఁగఁగాళ్ళతో నదిమి హుమ్మనితోమితి న త్తవీపు, నే
డీడకువచ్చె దానిఫల మే కుడుపుంగద కోడలా" యనుఁ.

చ. చనువునఁ గోతినెత్తి నొక చక్కనిజాయిడి య త్తవారికుం
డన విని ప్రక్కలై ధరఁబడఁ విడుఁ; బుట్టినయింటివారికుం
డన విని మెల్ల మెల్లన నపాయము సేయక డించు నట్లుగా
గొనకొను నత్తగారికిని గోడలికిం గల యానుకూల్యముల్.

పండుగలు

సంక్రాంతి

చ. నిరుపమలీల బాలికలు నిశ్చలభక్తిని యుక్తి సంకురా
తిరినెలఁ బేడగొబ్బిలులు దీర్తురు వాకిళులందు ముగ్గులఁ
బొరిబొరి బొమ్మల న్ని లిపి పూజలు సేతురు బొమ్మరిండ్లలో
బరువడి నారఁగించెదరు పచ్చడి బెల్లము పుల్గ మిచ్చులన్.

అట్లతద్దె

చ. బడిబడి నట్ల తద్దియను పండుగ వచ్చిన సంతసిల్లుచుఁ
వడిఁ దెలవాఱుచుక్క బొడువం గని లేచి సమస్తబాలికల్
మడినిడి పొట్ల కాయపరమాన్నము నన్నము మెక్కి యాటల?
బడిమఱునాఁట నుయ్యెలలపైఁదగనూఁగుట జూడనొప్పదే

దీపావళి

చ. చిటపట టుప్పుటప్ప నెడి సీమ టపాకుల పెట్టె లెన్ని యు
ద్భటముగ ధమ్ముధుమ్మను టపాకులవెన్ని, మతాబులెన్ని, పి
క్కటిలెడి ఝిల్లులెన్ని, మఱి కాకరపూవతులెన్ని గాల్తురో
దిటముగఁ దెల్ప నాతరమె దివ్వెలపండుగ రేయి నర్భకుల్.

వినాయక చవితి

చ. తొలుదినమే వినాయక చతుర్థికి ముందర రాల్ పలేరుగా
యలు గడియించి, పండుగ మహాగణనాధుని మంచిమంచిపూ
వులఁ బలుపత్రులం గటికిఁ బూజలు చేసుక ప్రొద్దుగ్రుంకఁగా
నల పొరుగిండ్ల ఁజల్లుకొను చాడికఁ జెందుదు రర్భకావళుల్.

సంవత్సరాది

సీ. అలవణ నింబపుష్పామ్లరసాలశ
లాటుఖండములు తొల్తఁ గబళించి
ఇష్టమృష్టాన్నముల్ తుష్టిగా భుజియించి
విప్రోత్తముఁడు గ్రామవీధిఁ జేరి
పదిమందిరయితుల గుదిగూర్చి కూర్చుండి
క్రొత్త పంచాంగంబు నెత్తి చదివి

ఆదాయములును వ్యయంబులు సెప్పి కం
దాయంబులకు వేళ యాయె ననిన.

గీ. దుడ్డు నిండుగ నిచ్చిన దొడ్డవారి
కన్నికందాయములు పూర్ణ మనుచు జెప్పు
దుడ్డు దుగ్గాని లేదన్న గొడ్డుఁబోతు
కన్ని కందాయముల శూన్య మనుచుఁ జెప్పు
నౌర బాపన సంవత్సరాదినాఁడు.

నానావిధేతర విషయములు

పొడుము

సీ. పాటిపొగాకు బైపయి మడ్డిగల బారు
దళసరికొమ్మముక్కలు గ్రహించి
నడిమీనె దివిచి చొప్పడఁ గణకణలాడు
మేలై ననిప్పుల మీఁదఁ గాచి
మంటికోసను నల్పి మంచికట్టును నూటి
తడియొత్తి సున్న మింత తగవైచి
నేర్పుతోఁ గమ్మని నేయి కొంచెము పోసి
పొలుపైనవన్నె రాఁ బొడుముఁ జేసి.

గీ. వెండిపొన్నూతఁ గొలుసు బొబ్బిలి పసందు
సోగమారెడు బుఱ్ఱఁ బోసుకొని రొండి
నిడి తలఁచినప్డు కించిత్తు పొడి గ్రహించి
బుఱ్ఱుమనఁ బీల్చు బాపని ముక్కె ముక్కు.

ఇతర విషయములు

చ. నలుగురుపట్టుపట్టుమన నాపలు కెవ్వరు వింద్రు, గట్టిగాఁ
దెలిపినఁగోపగింతురును ధీతిలకంబులు, దాని కేమిలే

యళుకనువిప్రజీవనము యాచ్నయటంఁడ్రు గృషింద్యజింతురిం
తలుగలవా? యటంచు సరి నాఁడులవారలు నవ్వునట్లుగన్.

శా. స్మార్తుల్ దూఱిరి మాధ్వభూసురుని గర్మభ్రష్టు డంచు న్వెసన్
స్మార్తున్ మాధ్వులు దూఱి రోడకను ముమ్మాఱు వ్రతభ్రష్టుగా
భర్తీ వైష్ణవవిప్రునందు నుభయ భ్రష్టత్వమం డ్రిద్దఱున్
ధూర్తత్వంబున విష్ణువాసరమునం దుం దద్దినం బబ్బినన్.

ఉ. తిండికి బత్తెమిండు నెల దీరిన దింకొకయిద్దు మప్పుగా
నిం డది తీరులోన జమ యిత్తు నటంచును గంప దుల్పఁగాఁ
బండినపంటలోన సగబాలు హరించును పాలివాఁడు బా
పం డొనరించు సేద్యమున బా గొకజుట్టు నతండు నిల్చుటే.

చ. మలుమలులంచు వచ్చినవి మంచివి గావవి, యే మొకాని యా
ర్నెలలకుఁ జిన్గు చీయొడలు నిండిన దట్టపు తాటిపాకచా
వులు మనునొక పుష్కరము పూచిమడంతను గట్టి చాకికిన్
నెల కొకసారిగా నుదుక నిండని యందురు వృద్ధభూసురుల్ .

ఉ. తిండ్లర బాలుమజ్జిగలు తేటతుషారపు నీళ్ళు పప్పులే
దిండ్లొకచెంపఁగప్పెగసి యెండయువానయుఁదూలిపోదు, రెం
డేండ్లకు నైదుసారు లుతి కించినబట్టలు, నేమి సెప్పుదున్
బెండ్లముమీఁదనింటిపయిఁ బెత్తనముంచినవానిసౌఖ్యముల్.

తెలుఁగునాడు

బ్రాహ్మణ ప్రశంస సంపూర్ణము.